www.aryadvi.com
తెలుగు దినపత్రిక
News Daily
ఆర్యాద్వి
అక్షర సత్యం - ప్రజా సాక్ష్యం
బుధవారం
14-10-2026
సంపుటి (VOLUME) : 1 సంచిక (ISSUE): 1
పేజీలు : 8
వెల : 1/-
Simultaneously Published from: Hyderabad | Vijayawada | Visakhapatnam




మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

## ఓటములకు ఓటర్ల జాబితా కారణమా?
## రాహుల్ గాంధీపై అమిత్ షా ఫైర్

- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో నిరసనలు చేస్తున్న రాహుల్‌పై అమిత్ షా విమర్శలు
- గుజరాత్ స్థానిక ఎన్నికల ఓటమికి ఓటర్ల జాబితా సవరణ కారణమా అని ప్రశ్న
- గాంధీనగర్‌లో 41 ఏళ్లుగా కాంగ్రెస్ గెలవలేదని గుర్తుచేసిన హోంమంత్రి
- ప్రధాని మోదీకి ప్రజామద్దతుకు గుజరాత్ విజయమే నిదర్శనమని వ్యాఖ్య



- మిగతా 2లో

## స్టార్‌లింక్‌కు అనుమతులు ఆపండి
### కేంద్రానికి ఆరెస్సెస్ అనుబంధ సంస్థ విజ్ఞప్తి

- స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు అనుమతులు నిలిపివేయాలని కేంద్రానికి విజ్ఞప్తి
- ఎలాన్ మస్క్ వ్యాఖ్యలు బాధ్యతారహితమన్న స్వదేశీ జాగరణ్ మంచ్
- జాతీయ భద్రత దృష్ట్యా స్టార్‌లింక్‌ను నిరోధించే హక్కు భారత్‌కు ఉందని స్పష్టీకరణ
- విదేశీ కంపెనీకి బదులు దేశీయ సేవలను ప్రోత్సహించాలని సూచన




- మిగతా 2లో

## లడఖ్ పేర్లపై చైనా అక్కసు..
## గట్టిగా బుద్ధి చెప్పిన భారత్

- లడఖ్‌లోని 28 ప్రాంతాలకు పేర్లు ఖరారు చేసిన కేంద్రం
- భారత్ చర్యపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన చైనా
- లడఖ్ భారత్‌లో అంతర్భాగమని స్పష్టం చేసిన విదేశాంగ శాఖ
- చైనా వాదనలతో వాస్తవాలు మారవని భారత్ ఘాటు జవాబు



- మిగతా 2లో



## కేంద్ర మంత్రి పదవికి డాక్టర్ ఎల్. మురుగన్ రాజీనామా

సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తోన్న వేళ దేశ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేంద్ర సమాచార ప్రసార శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ తన పదవికి రాజీనామా చేశారు.

- మిగతా 2లో

# విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర

- కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ
- వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య
- పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి





## కేంద్రంపై ఉమ్మడి పోరాటం..
### మోదీ, షా చుట్టూ ఉచ్చు బిగుస్తోంది

- ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేసిన విపక్షాలు
- నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదా రద్దును తీవ్రంగా ఖండన
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- రాహుల్ గాంధీ నాయకత్వంలో ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించిన కూటమి నేతలు

- మిగతా 2లో

## సింగరేణి కార్మికులకు 34 శాతం బోనస్ ప్రకటన

- సింగరేణి కార్మికులకు దసరా ధమాకా.. ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు బోనస్!
- సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్
- కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లింపు
- పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా
- అర్హులైన పర్మినెంట్ కార్మికులకు గరిష్ఠంగా రూ.1,53,913
- పండుగకు ముందే ఖాతాల్లో బోనస్ జమ చేయనున్న యాజమాన్యం



## హాస్టళ్లకు సరుకుల సరఫరా స్థానిక వెండర్లకే ఇవ్వాలి

- హాస్టళ్ల సరకుల సరఫరాకు పీఎంయూ టెండర్లు రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్
- స్థానిక వెండర్ల ద్వారానే డీపీసీ పద్ధతిలో సరకులు అందించాలని సూచన
- దీనివల్ల చిరు వ్యాపారులకు మేలు, విద్యార్థులకు నాణ్యత అందుతుందని వెల్లడి
- కమీషన్ల కోసం బ్లాక్‌లిస్ట్ సంస్థకు టెండర్ ఇచ్చారని తీవ్ర ఆరోపణ
- పాత విధానం తేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక



- మిగతా 2లో

# దళపతి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లింది

- బెజవాడలో విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమం
- ఒకే వేదికపై ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్
- యువత ఉత్సాహాన్ని చూసి పులకించిన చంద్రబాబు
- విజయవాడ ఉత్సవాల వేదికగా గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కీలక ప్రకటన
- ప్రధాని మోదీ నాయకత్వంలోనే ఐదు నదుల అనుసంధానం సాధ్యమని వెల్లడి
- యువత ఉత్సాహం చూస్తుంటే 2047 నాటికి భారత్ నంబర్ వన్‌గా నిలుస్తుందని ధీమా
- రాష్ట్రాలు వేరైనా దేశాభివృద్ధే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టీకరణ








### విజయవాడ ఉత్సవ్ 2.0.. వేదికపై మెరిసిన చంద్రబాబు, విజయ్

- విజయవాడ దసరా ఉత్సవాల్లో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్
- వేడుకలకు ముందు ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య కీలక భేటీ
- తెలుగు గంగ, గోదావరి-కావేరి అనుసంధానంపై చర్చించిన నేతలు
- ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం విజయ్
- పున్నమి ఘాట్‌లో ఇద్దరు సీఎంలకు అభిమానులు, ప్రజల నుంచి భారీ స్పందన

# చెన్నైకి తాగునీరు ఇవ్వండి
## చంద్రబాబును కోరిన సీఎం విజయ్

- ఉండవల్లిలో ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రుల సమావేశం
- చెన్నై తాగునీటి అవసరాల కోసం అదనపు జలాలు కోరిన సీఎం విజయ్
- గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చించిన చంద్రబాబు
- నీటి లభ్యతను బట్టి సాయం చేస్తామని చంద్రబాబు హామీ
- ఇప్పటికే చెన్నైకి 4.08 టీఎంసీలు విడుదల చేశామని వెల్లడి

తమ రాష్ట్ర రాజధాని చెన్నై నగరం ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తెలుగు గంగ ద్వారా అదనపు జలాలను విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన, మంగళవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశంపైనే

- మిగతా 2లో






## ఆమ్రపాలి క్యాడర్ వివాదం..
## హైకోర్టులో తీర్పు రిజర్వ్

- ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి పిటిషన్‌పై హైకోర్టులో తీర్పు రిజర్వ్
- తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని గతంలో క్యాట్ ఇచ్చిన ఆదేశాలు
- క్యాట్ తీర్పుపై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేసిన ఆమ్రపాలి
- ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పుపై సర్వత్రా ఆసక్తి

- మిగతా 2లో

## చెన్నైకి తాగునీరు ఇవ్వండి

- మొదటి పేజి తరువాయి

చర్చలు జరిగాయి.ముఖ్యమంత్రి విజయ్‌కు, ఆయన వెంట వచ్చిన అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో చెన్నై నగర తాగునీటి అవసరాలను తీర్చడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింతగా సహకరించాలని సీఎం విజయ్ అభ్యర్థించారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదిలో జలాల లభ్యత గణనీయంగా తగ్గి, ఏపీలోనే తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయినప్పటికీ, పొరుగు రాష్ట్ర దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు.ఇప్పటికే ఒప్పందం ప్రకారం చెన్నై నగరానికి 4.08 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు చంద్రబాబు వివరించారు. భవిష్యత్తులో ప్రాజెక్టులలో నీటి లభ్యత, అవసరాలను బేరీజు వేసుకుని, మరికొంత నీటిని విడుదల చేసే అంశాన్ని కచ్చితంగా పరిశీలిస్తామని ఆయన విజయ్‌కు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కరవు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు ఆవశ్యకతను చంద్రబాబు నొక్కి చెప్పారు. ఈ బృహత్తర పథకం రెండు రాష్ట్రాలకే కాకుండా దేశానికే మేలు చేస్తుందని ఆయన వివరించారు. ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు ద్వైపాక్షిక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.

## సింగరేణి కార్మికులకు 34 శాతం బోనస్ ప్రకటన

దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికర లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణి కార్మికుల ఇళ్లలో పండుగ
సందడి నెలకొంది.సింగరేణి సాధించిన నికర లాభాల్లో 34 శాతాన్ని పర్మినెంట్ కార్మికులకు బోనస్‌గా అందించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,53,913 వరకు అందనుంది. పండుగకు ముందే ఈ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.గతేడాది తరహాలోనే ఈసారి కూడా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించనున్నారు. ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లోనూ దసరా ఆనందం నిండనుంది.బొగ్గు గనుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. పండుగ వేళ బోనస్ ప్రకటనతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

## దళపతి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లింది

తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ రాకతో విజయవాడ నగరం దద్దరిల్లిపోతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్ 2.0' సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయ్‌తో కలిసి ఆయన వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు ఉద్విగ్నంగా ప్రసంగించారు. దుర్గమ్మ, భారత్ మాత, తెలుగు తల్లికి జయజయధ్వానాలు పలుకుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన, సభకు హాజరైన యువత ఉత్సాహాన్ని చూసి పులకించిపోయారు. "విజయ్ రాకతో మీ ఉత్సాహం చూస్తుంటే విజయవాడ దద్దరిల్లిపోతోంది" అంటూ సభికులను ఉత్తేజపరిచారు.
తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దళపతి విజయ్ మొట్టమొదటిసారిగా మరో రాష్ట్రానికి వచ్చారని, ఆ గడ్డ పవిత్రమైన విజయవాడ కావడం, దుర్గమ్మ తల్లే ఆయన్ను ఇక్కడికి పిలిపించడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. తమిళనాడును అభివృద్ధి చేయాలనే బలమైన పట్టుదలతో, కేవలం రెండేళ్లలోనే పార్టీ పెట్టి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి విజయ్ అని కొనియాడారు. ఆయన పట్టుదల, అంకితభావం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ కమిటీని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.ఈ సందర్భంగా చంద్రబాబు జాతీయ రాజకీయాలు, నదుల అనుసంధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్రాలు వేరు కావచ్చు, కానీ మా అందరి అభిమతం ఒకటే. భారతదేశం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలు బాగుండాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏదైనా సాధ్యమేనని చెబుతూ, గోదావరి-కావేరి నదుల అనుసంధానం త్వరలోనే జరుగుతుందని ప్రకటించారు. "దుర్గమ్మ తల్లి సాక్షిగా, మన విజయవాడ నుంచే గోదావరి, కృష్ణమ్మ తల్లులు కలుస్తాయి. ఈ మహత్కార్యాన్ని నెరవేర్చగల ఏకైక నాయకుడు నరేంద్ర మోదీ" అని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గోదావరి, కృష్ణ, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులు అనుసంధానమై నాలుగు రాష్ట్రాలు సస్యశ్యామలం అవుతాయని వివరించారు.వేదిక కింద ఉన్న యువతను, వారి ఉత్సాహాన్ని చూస్తుంటే భారతదేశ భవిష్యత్తుపై తనకు సంపూర్ణ విశ్వాసం కలుగుతోందని చంద్రబాబు అన్నారు. "టెక్నాలజీ, నాలెడ్జ్‌తో భారత యువత ప్రపంచంలో ఏదైనా సాధించగలదు. మీ ఉత్సాహం చూశాక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టెక్నాలజీ, నాలెడ్జ్‌కు ఆధ్యాత్మికతను జోడించి ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని, విజయవాడ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు ఆ ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. అనంతరం, వెండితెరపై కోట్లాది మంది అభిమానాన్ని చూరగొని, ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను ప్రసంగించవలసిందిగా చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు.

# విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర

దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

# రెండు ఎమ్మెల్సీ ఎన్నికలకు 77 మంది ఇంఛార్జ్ లు నియామకం

- మొదటి పేజి తరువాయి

అప్పగించింది.ఢిల్లీలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయిలో పార్టీ నేతల బాధ్యతలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం.

**గెలుపు బాధ్యత ఇన్‌చార్జ్‌లదే**

రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధించే బాధ్యతను ఇన్‌చార్జ్‌లు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.. ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మంత్రులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలకే ఎన్నికల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యేలు లేని ప్రాంతాల్లో ఎంపీలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు కేటాయించారు. కొడంగల్ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా అనుముల తిరుపతిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

**గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి**

ఎన్నికల్లో కీలకంగా మారనున్న గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టింది. అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలకు సూచించినట్లు సమాచారం. ఓటర్ల నమోదు ప్రక్రియపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టడంతో పాటు, నియోజకవర్గాల వారీగా సమన్వయం చేసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు
కాంగ్రెస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల నమోదు, ప్రచార సమన్వయంపై పార్టీ దృష్టి సారించింది. నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించడం ద్వారా బాధ్యతలను స్పష్టంగా విభజించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాబోయే ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అందుకే రెండు స్థానాల్లోనూ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని నేతలకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.ఎన్నికల్లో మొదటి స్థానానికే ప్రాధాన్యం ఉంటుందని, రెండో స్థానానికి అదే స్థాయి గుర్తింపు ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి నేతలకు స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర పార్టీ నేతలు తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించడంపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి పెట్టింది.

# హాస్టళ్లకు సరుకుల సరఫరా స్థానిక వెండర్లకే ఇవ్వాలి

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సరకుల సరఫరా చేసే విధానంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సరకుల సరఫరా కోసం నూతనంగా ప్రవేశపెట్టిన పీఎంయూ (ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్) టెండర్లను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విధానం స్థానిక చిరు వ్యాపారుల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆరోపించారు.
ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, గతంలో మాదిరిగానే పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి, డీపీసీ (జిల్లా కొనుగోలు కమిటీ) ద్వారా స్థానిక వ్యాపారులకే సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. అప్పుడే చిరు వ్యాపారులకు భరోసా ఉంటుందని, విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుతాయని పేర్కొన్నారు. స్థానిక వ్యాపారులకు అవకాశం ఇవ్వకుండా ఒకే సంస్థకు టెండర్లు అప్పగించడం వెనుక భారీగా కమీషన్ల ప్రయోజనాలు ఉన్నాయని ఆయన విమర్శించారు."కేవలం కమీషన్ల కోసం కక్కుర్తిపడి, ఇప్పటికే బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఒక సంస్థకు టెండర్లు కట్టబెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకుని పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు

## ఆమ్రపాలి క్యాడర్ వివాదం.. హైకోర్టులో తీర్పు రిజర్వ్

సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి తన క్యాడర్ కేటాయింపు వివాదంపై దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. దీంతో ఆమె క్యాడర్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగుతోంది.
రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్, ఆమెను ఏపీకి కేటాయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు, తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది.అయితే, క్యాట్ వెలువరించిన ఈ తీర్పుపై తెలంగాణ హైకోర్టు గతంలో స్టే విధించింది.
దీంతో క్యాట్ ఆదేశాల అమలు నిలిచిపోయింది. హైకోర్టు ఇచ్చిన ఈ స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి ఉన్నత న్యాయస్థానంలోనే మరో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. హైకోర్టు వెలువరించే తుది తీర్పుతో ఆమ్రపాలి క్యాడర్ కేటాయింపు వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## కేంద్రంపై ఉమ్మడి పోరాటం.. మోదీ, షా చుట్టూ ఉచ్చు బిగుస్తోంది

ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని విపక్షాలు మంగళవారం స్పష్టం చేశాయి. న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు ఎలాంటి పాత్ర పోషించినా, పోషించకపోయినా తమ ప్రతిఘటన ఆగదని తేల్చిచెప్పాయి. నిరసనల వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రకటించాయి.ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీతో పాటు ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, సీపీఎం, సీపీఐ, తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) సహా 'ఇండియా' కూటమికి చెందిన పలువురు కీలక నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల అనంతరం, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు రాహుల్ ఈ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "మాకు సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తి, న్యాయవ్యవస్థపై అపారమైన గౌరవం ఉంది. వారు తమ బాధ్యతను నిర్వర్తిస్తారని ఆశిస్తున్నాం. ఏ వ్యవస్థ స్పందించినా, స్పందించకపోయినా మా రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుంది, అంతిమంగా విజయం సాధిస్తుంది" అని అన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసి అంత సులభంగా తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. ఓట్ల దొంగతనానికి పాల్పడిన వారిపై చర్యలు తప్పవని పునరుద్ఘాటించారు. "ఈ కుట్రకు ప్రధాన రూపశిల్పి మోదీ కాగా, అమలు చేసిన వ్యక్తులు అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ అని, వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని వారు గ్రహించాలి. వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని హామీ ఇస్తున్నాం" అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**జంతర్ మంతర్‌పై పోరాటం**

నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదాను ప్రభుత్వం రద్దు చేయడాన్ని పలువురు నేతలు తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వంలోని భయం ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. జంతర్ మంతర్‌ను తిరిగి దక్కించుకోవడానికి పోరాడతామని సీపీఐ నేత డి. రాజా ప్రకటించారు. రాబోయే రోజుల్లో 'ఇండియా' కూటమి చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ జంతర్ మంతర్ వైపు మార్చ్ చేసే ప్రయత్నం ఉంటుందని కూటమి వర్గాలు తెలిపాయి.
సీపీఎం పొలిట్‌బ్యూరో సైతం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. శాంతియుత నిరసన హక్కును బలహీనపరిచేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించింది.

## స్టార్‌లింక్‌కు అనుమతులు ఆపండి: కేంద్రానికి ఆరెస్సెస్ అనుబంధ సంస్థ విజ్ఞప్తి

ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్టార్‌లింక్' శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు భారత్‌లో అనుమతులు మంజూరు చేయవద్దని, ఇందుకు సంబంధించిన ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అనుమతుల జాప్యంపై ఎలాన్ మస్క్ భారత ప్రభుత్వం, వ్యాపార వర్గాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎస్‌జేఎం, ఇవి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలని ఆరోపించింది.ఈ అంశంపై స్వదేశీ జాగరణ్ మంచ్ జాతీయ కో-కన్వీనర్ అశ్వినీ మహాజన్ మాట్లాడుతూ, "భారత్‌లో అనుమతుల జాప్యంపై ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారహితమైనవి. వాణిజ్య కార్యకలాపాల కోసం అనుమతులు కోరిన సంస్థ, ఆ ప్రక్రియ కొనసాగుతుండగానే ప్రభుత్వంపై, దేశీయ వ్యాపార వర్గాలపై విమర్శలు చేయడం సమంజసం కాదు. నిబంధనల ప్రకారం అనుమతులు పొందకుండా, ప్రత్యామ్నాయ మార్గాల్లో ఒత్తిడి పెంచే ప్రయత్నంగా ఇది కనిపిస్తోంది" అని విమర్శించారు."జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఏమాత్రం రాజీ పడకూడదు. ఉక్రెయిన్, ఇరాన్, రష్యా, చైనా, తైవాన్ వంటి పలు దేశాల్లో స్టార్‌లింక్ సేవలు ఇప్పటికే వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో, జాతీయ భద్రత దృష్ట్యా స్టార్‌లింక్‌ను నిరోధించే పూర్తి హక్కు భారత్‌కు ఉంది. మన నిర్ణయం అమెరికా వంటి వాణిజ్య భాగస్వాములకు సైతం ఒక స్పష్టమైన సందేశాన్ని పంపుతుంది" అని మహాజన్ పేర్కొన్నారు.ఒకవేళ జాతీయ భద్రత కారణాలతో స్టార్‌లింక్‌కు అనుమతులు నిరాకరిస్తే, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రోత్సహించేందుకు గొప్ప అవకాశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం మన సొంత సాంకేతికతతో ఇంటర్నెట్ సేవలను అందించవచ్చని సూచించారు. ప్రస్తుతం స్టార్‌లింక్ దరఖాస్తు ప్రభుత్వ పరిశీలనలో ఉన్న తరుణంలో, ఎస్‌జేఎం చేసిన ఈ విజ్ఞప్తి ప్రాధాన్యత సంతరించుకుంది.

## లడఖ్ పేర్లపై చైనా అక్కసు.. గట్టిగా బుద్ధి చెప్పిన భారత్

లడఖ్‌లోని 28 వ్యూహాత్మక ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా పేర్లు ఖరారు చేయడంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చర్య చట్టవిరుద్ధమని చైనా ఆరోపించగా, భారత్ అత్యంత ఘాటుగా స్పందించింది. లడఖ్ భారత్‌లో విడదీయరాని అంతర్భాగమని, చైనా ఆరోపణలు ఈ వాస్తవాన్ని మార్చలేవని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, లడఖ్ యంత్రాంగంతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. శిఖరాలు, కనుమలు, జలవనరులతో సహా మొత్తం 28 ప్రదేశాలకు ప్రామాణిక పేర్లను నిర్ణయించి, వాటిని సర్వే ఆఫ్ ఇండియా అధికారిక మ్యాప్‌లో చేర్చనున్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాలకు సంబంధించి స్పష్టమైన గుర్తింపు, అవగాహన పెరుగుతుందని విదేశాంగ శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.తన భౌగోళిక రికార్డులను పటిష్ఠం చేసుకునేందుకే భారత్ ఈ చర్యలు చేపట్టింది. దీనిపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందిస్తూ, భారత్ ఏకపక్షంగా ఏర్పాటు చేసిన 'కేంద్రపాలిత ప్రాంతం లడఖ్'ను తాము ఎన్నడూ గుర్తించలేదని వ్యాఖ్యానించారు. "భారత్ ప్రకటిం చిన ప్రామాణిక పేర్లను మేము వ్యతిరేకిస్తున్నాం. ఈ చర్య చట్టవిరుద్ధం, చెల్ల దు. చైనా-భారత్ సరిహద్దులోని పశ్చిమ సెక్టార్‌లోని ఆ ప్రాంతాలు ఎల్లప్పు డూ చైనా భూభాగాలే" అని ఆమె వాదించారు.చైనా వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. "కేంద్రపాలిత ప్రాంతమైన లడఖ్ భారత్‌లో విడదీ యరాని అంతర్భాగం. ఈ సుస్థిర వాస్తవాన్ని చైనా ఎంతగా వ్యతిరేకించినా మార్చలేదు" అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

## కేంద్ర మంత్రి పదవికి డాక్టర్ ఎల్. మురుగన్ రాజీనామా

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు ప్రధాని మోడీకి రాజీనామా లేఖను పంపించారు. అలాగే రాజ్యసభ సభ్యత్వానికి కూడా మురుగన్ రిజైన్ చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మంగళవారం (అక్టోబర్ 13) ఈ విషయాన్ని ఆయన ప్రకటించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులో బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి పూర్తిగా సమయం కేటాయించాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. తమిళనాడులో బీజేపీ విజయం కోసం క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో కలిసి మళ్లీ పని చేస్తానని తెలిపారు. ప్రధాని మోడీ నాయకత్వంలో భారత్ మాతకు, తమిళనాడుకు సేవ చేయడం నా జీవితంలో లభించిన గొప్ప గౌరవమని మురుగన్ పేర్కొన్నారు. అతి సామాన్య కుటుంబంలో పుట్టి కేంద్ర మంత్రివర్గంలో పనిచేయడం నా జీవితంలో లభించిన గొప్ప అదృష్టమన్నారు.

**మురుగన్ పొలిటికల్ కెరీర్:**

మోడీ 3.0 కేబినెట్?లో డాక్టర్ ఎల్. మురుగన్ సమాచార, ప్రసార శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అంతకుముందు మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ సహాయ మంత్రిగా కూడా పనిచేశారు. ఆయన మధ్యప్రదేశ్ నుండి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 2017 నుంచి 2020 వరకు జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. బీజేపీ తమిళనాడు యూనిట్ అధ్యక్షుడిగా కూడా మురుగన్ సేవలందించారు.
మరోసారి కేబినెట్ విస్తరణ ప్రచారంకేంద్ర మంత్రి మురుగన్ రాజీనామాతో కేంద్ర కేబినెట్ విస్తరణ ప్రచారం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాని మోడీ తన కేబినెట్?ను పునర్వ్యవస్థీకరించనున్నట్లు గత కొన్ని రోజులుగా ఢిల్లీ రాజకీయాల్లో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. దేశంలో జెన్ జెడ్ నిరసనలు, 2029 పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొత్త కేబినెట్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. యువతకు మరింత చేరువయ్యేందుకు పలువురు సీనియర్లను పక్కన పెట్టి కేబినెట్?లోకి యువ నాయకులను తీసుకోనున్నట్లు టాక్ నడుస్తోంది.

3
బుధవారం 14 అక్టోబర్ 2026
జనరల్ న్యూస్
ఆర్యాద్వి
www.aryadvi.com

# గ్రామ ప్రజలకు తెలియకుండా గ్రామసభ.. వెంకట్రమాపురంలో వివాదం....




**అనంతగిరి అక్టోబర్ 13 (ఆర్యాద్వి):** మండల పరిధిలోని వెంకట్రమాపురం గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించిన విషయం గ్రామ ప్రజలకు తెలియకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాటింపు వేయడం గానీ, మైక్ ద్వారా ప్రకటించడం గానీ లేకుండా గ్రామసభ నిర్వహించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం గ్రామసభలో గ్రామ పంచాయతీ ఓటర్లందరూ సభ్యులే పాల్గొనే వేదికగా ఉండాల్సి ఉంది.

**స్థానికుల ఆరోపణలు**

గ్రామ పంచాయతీ నుంచి ఏ విధమైన అధికారిక సమాచారం లేకుండా, గుట్టుచప్పుడు కాకుండా గ్రామసభ నిర్వహించడం జరిగిందని స్థానికులు తెలిపారు. సభ జరిగిన విషయం గ్రామంలో చాలామందికి తెలియకపోవడంతో ప్రజలు పాల్గొనే అవకాశం దక్కలేదని, ఇది గ్రామసభ ముఖ్యోద్దేశానికే విరుద్ధమని వారు విమర్శిస్తున్నారు. గ్రామసభలు గ్రామ పంచాయతీ పరిధిలోని ఓటర్ల భాగస్వామ్యంతోనే అర్థవంతంగా నిర్వహించాలని నిబంధనలు సూచిస్తున్నాయి.

ఈ విషయంపై గ్రామ కార్యదర్శి నాగలక్ష్మిని స్థానికులు ప్రశ్నించగా, "విద్యుత్ పరికరానికి ఛార్జింగ్ లేదు", "గ్రామంలో చాటింపులు వేసేవారు లేరు" అంటూ జవాబిచ్చినట్లు తెలిసింది. అయితే, ప్రభుత్వ సమాచారం ప్రజలకు అందించడం పంచాయతీ వ్యవస్థ బాధ్యత అని, సాంకేతిక లోపాన్ని కారణంగా చూపడం సబబు కాదు అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యాఖ్యపై గ్రామస్థుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. గ్రామసభ అనేది ప్రజల సమస్యలు, పంచాయతీ నిధులు, అభివృద్ధి పనులపై బహిరంగంగా చర్చించే వేదిక కాగా, దానికి సంబంధిత సమాచారం లేకుండా నిర్వహించడం పారదర్శకతపై సందేహాలు రేపుతుంది. గతంలో కూడా సెలవు పెట్టకుండా హైదరాబాద్ వెళ్లిన ఘటన వార్తల్లోకి రావడంతో, కార్యదర్శి నాగలక్ష్మి వ్యవహరించే తీరుపై ఇప్పటికే విమర్శలు ఉన్నాయి. ఈసారి కూడా ప్రజలకు సమాచారం అందించకుండా

గ్రామసభ నిర్వహించిన తీరు పట్ల గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శి తీరు మారకపోతే గ్రామ పాలనపై ప్రజల నమ్మకం మరింత దెబ్బతింటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై సర్పంచ్ ను వివరణ అడుగగా: గ్రామసభకు చాటింపు అవసరం లేదని కార్యదర్శి ఆదేశించినట్లు గ్రామ సర్పంచ్ జయరాజు తెలిపారు.

# దానవాయిగూడెంలో మహా అన్న దాత - చల్లా కృష్ణ..





**ఖమ్మం నగరం: అక్టోబర్,13 :**
**పాలేరు నియోజకవర్గంలో దేవి నవరాత్రి ఉత్సాహ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న వేళ దానవాయిగూడెం 59వ డివిజన్ 9వ లైన్ లో అమ్మవారి నామకరణంతో అత్యధిక వాతావరణం విరుస్తుంది దుర్గామాత ఆశీస్సులు అందరికీ కలగాలని లోకమంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ నవరాత్రి సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు**
**ఈ కార్యక్రమంలో భక్తులు ప్రజలు యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారని వాళ్ళందరికీ పేరుపేరునా అన్నదాన దాత "చల్లా కృష్ణ" మరియు ఉత్సాహ కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.**

# ఒకే బంధు వర్గానికి...పదవులా...

మున్నూరు కాపు సంఘం మూడు ముక్కలు కావడానికి కారణం మీరు కా దా...

కలిసి పోవడానికి మేము సిద్ధమే...

త్వరలో జిల్లా, నగర కమిటీలు వేస్తాం



**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 13:** మున్నూరు కాపు సంఘంలో ఒకే బంధు వర్గానికి పదవులా అని ఆ సంఘం నాయకులు ప్రశ్నించారు. ఖమ్మం లోని రాపర్తి శరత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మున్నూరు కాపు సంఘం సీనియర్ రాష్ట్ర నాయకులు శెట్టి రంగారావు, మాజీ కార్పొరేటర్, సంఘం నగర అధ్యక్షులు రాపర్తి శరత్ మాట్లాడారు. సీనియర్ నాయకులు మేకల సంగయ్య ఫోటో లేకుండా ఫ్లెక్సీలు వేశారని, ఇది అవమానకరమని అన్నారు. అందరూ కలిసి ఉండాలని అనే ఉద్దేశ్యంతో ఏనాడూ సంఘంలో పని చెయ్యని శీలంశెట్టి వీరభద్రం ను జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించినా తాము అంగీకరించామన్నారు. 11 ఏళ్ల నుండి సంఘాన్ని అడ్డం పెట్టుకుని పబ్బం గడుపుకున్నదెవరో అందరికీ తెలుసునన్నారు. రాపర్తి కుటుంబం నుండి వచ్చిన వ్యక్తిని నగర అధ్యక్షులు గా నియమించినందుకు కుట్ర చేశారన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి తమను ఎందుకు పిలువలేదో చెప్పాలన్నారు. కలిసిపోయే గుణముంటే తమను పిలిపించి మాట్లాడాలి కదా అన్నారు. కలిసిపోవడానికి తాము సిద్ధమేనన్నారు. లేకుంటే కుల పెద్దలను సంప్రదించి తమ పని తాము చేసుకపోతామన్నారు. త్వరలోనే జిల్లా, నగర కమిటీలు వేస్తామన్నారు. ఈ సమావేశం లో ట్రస్టు బోర్డు సెక్రటరీ కలిశెట్టి నర్సయ్య, గౌరవ సలహాదారులు మూలగుండ్ల శ్రీహరి, నగర కార్యదర్శి బైరిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి గంగిశెట్టి శ్రీనివాస్, కోయచలక ఉప సర్పంచ్ మాధవశెట్టి హన్మంతరావు, కార్మిక విభాగం అధ్యక్షుడు విప్లవ కుమార్, మహిళా విభాగం నాయకురాలు బాసెట్టి శ్రావ్య, నాయకులు బైరిశెట్టి పవన్ కుమార్, పసుపు లేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ శబరిమలలో 7 వ రోజు అన్నప్రసాద వితరణ



అక్టోబర్ 13, అనంతగిరి(ఆర్యాద్వి):అనంతగిరి లో కొలువైన తెలంగాణ శబరిమల శ్రీ అయ్యప్ప సన్నిధిలో ప్రారంభమైన అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏడో రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ సందర్భంగా సుమారు 250 మంది భవానీ మాలధారణ స్వాములు, మాతలు మరియు అయ్యప్ప భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ రోజు అన్నప్రసాద వితరణకు దాతలుగా మహారాజపోశకులు బుర్రా పుల్లారెడ్డి--సుధారాణి దంపతులు, పసుమర్తి హరిప్రకాష్--ప్రత్యూష దంపతులు వ్యవహరించారు. వారి ఔదార్యంతో భక్తులకు అన్నప్రసాద వితరణ సజావుగా జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, పందిరి వీరయ్య, ఆనంతుల ఉపేందర్, నారపరాజు వినయ్, అయితనబోయిన వెంకటేశ్వర్లు, పాలిక నరసింహారావు, లైన్ మెన్ భాస్కర్, ఈదుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.
అన్నదానం మహాదానం అనే భావనతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణను కొనసాగిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

# చిలుకూరులో నూతన చర్చి ప్రారంభం...




**అక్టోబర్ 13, కోదాడ (ఆర్యాద్వి):** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన చర్చిని ఎన్ఆర్ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెల్లంకొండ రవి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతున్న బెల్లంకొండ రవి, క్రైస్తవ సమాజ అభివృద్ధికి, చర్చి అభివృద్ధి కార్యకలాపాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సందర్భాల్లో తప్పనిసరిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. నూతన చర్చి ప్రారంభంతో ప్రాంత క్రైస్తవ సమాజం ఆనందం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినందుకు చర్చి నిర్వాహకులు, స్థానిక సోదరులు బెల్లంకొండ రవికి కృతజ్ఞతలు తెలిపారు.

# దుర్గమ్మ పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు



అనంతగిరి, అక్టోబర్ 13( ఆర్యాద్వి): మండల పరిధిలోని రఘునాథ ఆలయంలో ఏర్పర్చిన దుర్గమ్మ విగ్రహ పూజలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు పాల్గొని
అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ ప్రజల సంక్షేమానికి, వర్షాలకు, పంటలకు అమ్మవారి అనుగ్రహం కలగాలని అన్నారు. గ్రామ దేవతల పూజలు గ్రామంలో ఐక్యతకు, సామాజిక సమగ్రతకు చిహ్నమని అన్నారు. అమ్మవారి కృపతో గ్రామంలో శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం నెలకొనాలని కోరారు. సంప్రదాయ పండుగలను తరతరాలుగా కొనసాగించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు నిలిచిపోతాయని పేర్కొన్నారు.
గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని, ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని చందర్‌రావు హామీ ఇచ్చారు. అనంతరం
దుర్గమ్మ ఉత్సవాల ఏర్పాట్లలో కృషి చేసిన గ్రామ పెద్దలు, యువకులు, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవ వాతావరణాన్ని కల్పించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
ఆర్యాద్వి
www.aryadvi.com

## ఢిల్లీలో కాంగ్రెస్ నేతలపై లాఠీఛార్జిను ఖండించిన పన్యాల జైపాల్ రెడ్డి

ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి గాయాలు కావడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై లాఠీఛార్జి చేయడం ఆందోళనకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పన్యాల జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

## రాజకీయాల కన్నా ప్రజా సంతృప్తి కీలకం

తెలంగాణ రాజకీయ తెరపై ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తులు, పైఎత్తులు ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. రాజకీయ వ్యూహాల్లోనూ, మైండ్ గేమ్‌లోనూ తనదైన దూకుడు ప్రదర్శిస్తున్న రేవంత్.. పాలన విషయానికి వచ్చేసరికి మాత్రం అదే స్థాయిలో సక్సెస్ కాలేకపోతున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి గట్టిగా వినపడుతున్నాయి. ప్రభుత్వ మార్పుతో సరికొత్త సంచలనాలు వస్తాయని ఆశించిన సామాన్య ప్రజలు.. కనీసం గతంలో అందిన సంక్షేమ పథకాలైనా సక్రమంగా అందుతాయా లేదా అనే సందేహంలో పడిపోయారు.గత బీఆర్ఎస్ హయాంలో అమలులో ఉండి, ప్రజల దైనందిన జీవితంలో భాగమైన కొన్ని పథకాలు రేవంత్ రెడ్డి పాలనలో మందగించడం, అసలు అమలు కాకపోవడం ప్రధాన విమర్శలకు దారితీస్తోంది. కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అమల్లో సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో, పాత పథకాల పంపిణీలో సైతం ఆలస్యం జరగడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ముఖ్యంగా రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి నిబంధనలు లేకుండా లభించిన రైతు బీమా పథకాలు.. కాంగ్రెస్ తెచ్చిన రైతు భరోసా పేరు మార్పుతో పాటు ఆంక్షలు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. సాగులో లేని భూములు, గుట్టలకు పెట్టుబడి సాయం కట్ చేస్తామని ప్రకటించినప్పటికీ, అసలైన రైతులకు వానాకాలం, యాసంగి పెట్టుబడి సహాయం అందించడంలో విపరీతమైన ఆలస్యం జరుగుతోందని ప్రతిపక్షాలు , రైతు సంఘాలు మండిపడుతున్నాయి.పేద కుటుంబాల్లో పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్' పథకాల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు చెక్కులు అందడం లేదని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది అప్లికేషన్లు పెండింగ్‌లో పడిపోయాయని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చినప్పటికీ, పాత ఆర్థిక సహాయం రూ. 1,00,116 అందించడంలోనే నత్తనడక నడవడం ఆర్థిక లోటును తేటతెల్లం చేస్తోంది. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక లోటు, భారీ రుణభారం కారణంగానే సంక్షేమ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయలేకపోతున్నామని పాలకపక్షం సమర్థించుకుంటున్నప్పటికీ.. ప్రజలకు మాత్రం లబ్ధి వేగంగా అందడం లేదనేది వాస్తవం. బీఆర్ఎస్ హయాంలో లోపాలున్నప్పటికీ పథకాలు నిరంతరాయంగా అందేవని, కానీ ఇప్పుడు నిధుల కొరత సాకుగా చూపి ఆలస్యం చేస్తున్నారనే భావన పల్లెల్లో వ్యక్తమవుతోంది. రాజకీయంగా ప్రత్యర్థులను కార్నర్ చేయడంలోనూ, పట్టు నిలుపుకోవడంలోనూ నిరంతరం బిజీగా ఉంటున్న రేవంత్ రెడ్డి.. గ్రౌండ్ లెవెల్ అడ్మినిస్ట్రేషన్‌పై అదేస్థాయి దృష్టి పెట్టలేకపోతున్నారనేది ఎక్కువ మంది అభిప్రాయం. ప్రతిపక్షాలపై విమర్శలతో సమయం గడపడం కంటే, ప్రజలకు నిత్యావసరాలుగా మారిన సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తేనే ప్రభుత్వానికి నిజమైన దూకుడు ఇమేజ్ లభిస్తుందని అంటున్నారు.

## మంథనిలో అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులు పట్టివేత

పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని కూచిరాజపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రెండు చిన్న ట్రాలీలలో ఆవులను కరీంనగర్‌కు తరలిస్తుండగా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ సోమన్న, ఎండీ తుఫాన్ కలిసి 11 ఆవులను రెండు చిన్న ట్రాలీలలో కరీంనగర్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మంథని పట్టణంలోని కూచిరాజపల్లి వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని పట్టుకున్నారు. పట్టుకున్న ఆవులను, అలాగే నిందితులను తదుపరి విచారణ నిమిత్తం మంథని పోలీసులకు అప్పగించారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి..

## ముగ్గురు అరెస్ట్..

## రూ.17,300 నగదు స్వాధీనం

మెదక్ జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు నిఘా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా కుల్చారం మండలం పోతన్‌శెట్టిపల్లి గ్రామంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్ వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.17,300 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిని కుల్చారం గ్రామానికి చెందిన సత్యనారాయణ, శేఖర్, నర్సింలుగా గుర్తించారు. పేకాటకు సంబంధించి కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, సమాచారం అందిన వెంటనే దాడులు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## మైనర్ మిస్సింగ్ కేసులను అత్యంత ప్రాధాన్యతతో విచారించాలి





- సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలి
- జిల్లా వ్యాప్తంగా విజబుల్ పోలిసింగ్.. నిరంతరం వాహనాల తనిఖీలతో నేరాలు కట్టడి
- నేర సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్

**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 13:** మైనర్ బాలబాలికలు కనిపించకుండా పోయిన కేసులను పోలీసులు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ప్రతి కేసులో తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులను ఆదేశించారు.మంగళవారం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..మైనర్ మిస్సింగ్ ఫిర్యాదు అందిన వెంటనే కేసు తీవ్రతను గుర్తించి, ఆలస్యం చేయకుండా చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని సూచించారు. మిస్సింగ్ అయిన బాలబాలికల ఆచూకీ గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, మొబైల్ ఫోన్ సమాచారం, ఇతర అందుబాటులో ఉన్న ఆధారాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.బాలబాలికలు ప్రమాదంలో ఉన్నారనే అనుమానం ఉన్నప్పుడు తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని, మానవ అక్రమ రవాణా, కిడ్నాప్ వంటి కోణాల్లోనూ కేసు పరిస్థితులకు అనుగుణంగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ మైనర్ల ఆచూకీని త్వరితగతిన గుర్తించేందుకు కృషి చేయాలన్నారు.ప్రతి మైనర్ మిస్సింగ్ కేసు పురోగతిని ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, దర్యాప్తులో నిర్లక్ష్యం వహించే అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరిస్తూ సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ప్రధాన రహదారులు, వ్యాపార సముదాయాలు, దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు, వ్యాపారుల భాగస్వామ్యం తో సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా రహదారులు, ప్రవేశ ద్వారాలు, బయటకు వెళ్లే మార్గాలు స్పష్టంగా కనిపించేలా కెమెరాలను అమర్చుకోవాలని తెలిపారు.ప్రజలు తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ఏర్పాటు చేసిన కెమెరాలు నిరంతరం పనిచేసేలా నిర్వహణ చేపట్టాలని సూచించారు.
ప్రజల భద్రత, నేరాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగాలని, ప్రధాన రహదారులు, కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాల తనిఖీలు చేపడుతూ ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల పత్రాలను పరిశీలించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచుతూ అక్రమ రవాణా, నిషేధిత మాదకద్రవ్యాల సరఫరా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ తదితర అవసరమైన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.ప్రజల భద్రత, నేరాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగాలని, ప్రధాన రహదారులు, కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాల తనిఖీలు చేపడుతూ ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల పత్రాలను పరిశీలించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచుతూ అక్రమ రవాణా, నిషేధిత మాదకద్రవ్యాల సరఫరా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ తదితర అవసరమైన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.మహిళల భద్రత, స్వీయరక్షణపై ఉమేన్ సేఫ్టీ విభాగం, షీటీమ్ బృందాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. మహిళలు, బాలికలు ఎలాంటి భయం లేకుండా విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో ముందుకు సాగేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు.
సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, శ్రీనివాసులు, మహేష్, సర్వర్, సత్యనారాయణ, నర్సింహారావు,సాంబరాజు,సుశీల్ సింగ్, ఏవో కళావతి పాల్గొన్నారు

## ఖమ్మం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు..





**ఖమ్మం నగరం: అక్టోబర్, 13 :** ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఖమ్మం నగరపాల సంస్థ ప్రాంగణంలో మంగళవారం ఉత్సాహంగా మరియు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు . ఖమ్మం నగరపాలక సంస్థ ఆవరణమంతా పూలతో అలంకరించి , కలిసి సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను తయారుచేసి వాటి చుట్టూ తిరుగుతూ, బతుకమ్మ పాటలు పాడారు .ఆవరణమంతా పండుగ శోభను సంతరించుకుంది ఈ బతుకమ్మ సంబరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది . ఈ సంస్కృతి , సంప్రదాయాలను పెద్దల నుంచి నేర్చుకోవడానికి మంచి అవకాశం కల్పించింది . ఈ బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదు , ఇది ప్రకృతిని , జీవితాన్ని పూజించే పండుగ . మన సంస్కృతిని , వారసత్వాన్ని భావితరాలకు అందించడం చాలా అవసరం .,వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సంబరాల కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు సుధాకర్,బుర్రి వెంకటేశ్వర్లు,వాటర్ సప్లై లైన్మెన్లు రమణ, సాంబశివరావు, ప్రభాకర్,సూర్యం, సత్యనారాయణ,



వాల్ ఆపరేటర్స్ తదితరులు పాల్గొని వివిధ విభాగాల మహిళలు బతకమ్మ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు



# వల్లభనేని వంశీ మళ్లీ డ్యూటీ ఎక్కారు! కార్యకర్తలతో మాస్ స్పీచ్



**హైదరాబాద్** : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ నియోజకవర్గ రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అయ్యారు. స్థానిక ఎన్నికల్లో అధికార కూటమికి భయపడకుండా కార్యకర్తల్లో ధైర్యం నింపే బాధ్యతను భుజాలకెత్తుకున్నారని అంటున్నారు. స్థానిక ఎన్నికలకు నేడో రేపో నగారా మోగుతుందని అనగా, గన్నవరం నియోజకవర్గంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన వంశీ కీలక వ్యాఖ్యలు చేశారు. తన వెనుక జగన్ ఉన్నారని, తనను ఎవరూ ఏం చేయలేరంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పేరు పెట్టకుండా ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమైన నేతల్లో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పేరు ముందు వరుసలో ఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో ఆయన చూసిన దూకుడు కారణంగా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారనే అభిప్రాయం ఉంది. ఇక గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వంశీని అరెస్టు చేసిన పోలీసులు సుమారు 150 రోజుల పాటు నిర్బంధంలోనే ఉంచారు. ఈ క్రమంలో ఆయనపై వరుస కేసులు నమోదు అయిన విషయం తెలిసిందే. అయితే ఇన్నాళ్లు ఈ కేసుల విషయంలో పెద్దగా మాట్లాడని మాజీ ఎమ్మెల్యే వంశీ స్థానిక ఎన్నికల సమయంలో కాస్త గట్టిగానే సౌండ్ చేస్తుండటం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.తాజాగా గన్నవరం కార్యకర్తల సమావేశం నిర్వహించిన వంశీ ఎన్నికలకు కేడర్ ను సన్నద్ధం చేసే క్రమంలో మాట్లాడిన మాటలు వైరల్ అవుతున్నాయి. వైసీపీకి ప్రజల్లో ఆదరణ ఉందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, మన చిటికెను వేలి వెంట్రుకను కూడా ఎవరూ టచ్ చేయలేరని వ్యాఖ్యానించి అగ్గి రాజేశారు. మహా అయితే ఏం చేయగలరు? నాపై 33 కేసులు పెట్టారు, 150 రోజులు జైల్లో పెట్టారు? నేను అవినీతి చేశానని కేసులు పెట్టారా? టీడీపీలో ఉండగా నాలుగేళ్లు నంబర్ వన్ ఎమ్మెల్యే అంటూ పొగిడేవారు. చంద్రబాబు, లోకేశ్ బాబుతో విభేదించిన తర్వాత అవినీతి ఆరోపణలు, కేసులు పెట్టారు అంటూ వంశీ ఆరోపించారు.

**తిడితే కూర్చోవాలా?**

ఇక తనను లోపల వేశారని సంతోష పడుతున్నారని, నన్ను లోపల వేసిన వాడిని లోపల వేసిన వాడు ఎవడో తెలుసు కదా? నా వెనుక ఆయన ఉన్నారు అంటూ పరోక్షంగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై వంశీ దాడి చేయడం ద్వారా తన వైఖరి మునుముందు ఎలా ఉండబోతోందో చెప్పకనే చెప్పారని అంటున్నారు. తాను అవినీతి చేశానని కేసులు పెట్టలేదని, ఎవరినో తిట్టానని మాత్రమే కేసులు పెట్టారని అన్నారు. నన్ను తిట్టిన వారిని తాను తిరిగి తిట్టకూడదా? అంటూ ప్రశ్నించిన వంశీ తాను ఎలాంటి తప్పు చేయలేదని చెప్పుకునే ప్రయత్నం చేయడమే చర్చనీయాంశం అవుతోంది.

**మళ్లీ రచ్చకు సిద్ధమా?**

కాగా, మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ తాజా వ్యాఖ్యలు రాజకీయంగా హీట్ పుట్టిస్తున్నాయి. ఈ వ్యాఖ్యల ద్వారా టీడీపీ కేడర్ ను రెచ్చగొట్టాలనే వ్యూహంతోపాటు ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని తన అనుచరులు, వైసీపీ కార్యకర్తలకు ధైర్యం చెప్పాలనే ఆలోచన ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికల సమయంలో తనపై నమోదైన కేసులు, కూటమి నుంచి ఎదరయ్యే ఒత్తిళ్లకు భయపడితే ఇబ్బంది తప్పదనే ఆలోచనతో మాజీ ఎమ్మెల్యే దూకుడు పెంచినట్లుగా ఉందని అంటున్నారు. మొత్తానికి మళ్లీ దూకుడుగానే ఉండాలనే నిర్ణయంలో భాగంగానే ఆయన దేనికైనా రెడీ అన్న సంకేతాలు పంపుతున్నట్లుగా భావిస్తున్నారు.

# పులివెందులను కాపాడుకునేలా.. జగన్ కీలక నిర్ణయం



**హైదరాబాద్** : స్థానిక ఎన్నికల్లో సొంత నియోజకవర్గం పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని దక్కించుకునేలా వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహనరెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. వైనాట్ పులివెందుల అంటూ రణనినాదం చేస్తున్న కూటమికి చెక్ చెప్పాలనే నిర్ణయంలో భాగంగా తన సొంత కుటుంబం నుంచే మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిని బరిలోకి దింపుతున్నారని చెబుతున్నారు. జగన్ బాబాయ్, పులివెందుల నియోజకవర్గ వైసీపీ వ్యవహారాలను పర్యవేక్షించే వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి ప్రమీలమ్మను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారని అంటున్నారు. ప్రమీలమ్మ గతంలోనూ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేయడం, కూటమి అభ్యర్థిని దీటుగా ఎదుర్కొవాలంటే తమ కుటుంబ సభ్యులే పోటీ చేయాలనే ఉద్దేశంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు.

మాజీ సీఎం జగన్మోహనరెడ్డి సొంత ఇలాకాలో గెలిచి ఆయనకు షాక్ ఇవ్వాలని కూటమి పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయని అంటున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో తమకు పోటీ కూడా అవకాశం లేకుండా చేసిన చోట మున్సిపల్ చైర్ పర్సన్ పీఠం దక్కించుకోవాలని చాలా కాలంగా స్కెచ్ వేస్తున్నట్లు చెబుతున్నారు. గత ఏడాది జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో రికార్డు మెజార్టీతో గెలిచి జగన్ రెడ్డికి షాక్ ఇచ్చిన టీడీపీ, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే ఫీట్ రిపీట్ చేయాలని భావిస్తోందని అంటున్నారు. అయితే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ కూటమి జోరుకు బ్రేకులు వేసేలా జగన్ రెడ్డి ముందు నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తాజా ఎంపిక ద్వారా రుజువు అవుతోందని అంటున్నారు.కూటమి నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం, ప్రత్యక్ష ఎన్నికలు కావడం వల్ల సరైన అభ్యర్థిని రంగంలోకి దింపాలనే ఆలోచనతో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రమీలమ్మను జగన్ రెడ్డి పోటీకి దింపాలని జగన్ రెడ్డి భావిస్తున్నారని అంటున్నారు. కడప ఎంపీ అవినాశ్ రెడ్డికి స్వయాన చిన్నాన్న అయిన వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి ప్రమీలమ్మకు పులివెందుల పట్టణంలో మంచి గుర్తింపు ఉందని అంటున్నారు. స్థానికంగా మనోహర్ రెడ్డి, ప్రమీలమ్మ పార్టీ బాధ్యతలు చూస్తున్నందు వలన గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జగన్ రెడ్డి ఆలోచనగా ఉందని అంటున్నారు.

పులివెందుల మున్సిపాలిటీ మాజీ సీఎం జగన్ రెడ్డి కుటుంబానికి కంచుకోటగా చెబుతున్నారు. పంచాయతీగా ఉన్నప్పటి నుంచి జగన్ రెడ్డి కుటుంబ సభ్యుల పెత్తనమే నడుస్తూ వస్తోందని అంటున్నారు. జగన్ రెడ్డి నాన్నమ్మ జయమ్మ గతంలో పంచాయతీ సర్పంచ్ గా పనిచేశారని, అప్పటి నుంచి 2005లో మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తర్వాత కూడా వైఎస్ కుటుంబ సభ్యుల హవానే కొనసాగిందని చెబుతున్నారు. ఇప్పటివరకు ఏకపక్షంగా గెలుచుకున్న పులివెందుల తమ కుటుంబ ప్రతిష్టకు నిదర్శనంగా జగన్ రెడ్డి భావిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇక్కడ నుంచి మరెకవరీ అవకాశం ఇవ్వకూడదని ఆలోచనతో ఆయన తన పిన్ని ప్రమీలమ్మను పోటీకి పెడుతున్నట్లుగా చెబుతున్నారు.

# ఏపీ బాల్‌థాక్రే.. విజయసాయి పెద్ద కలలు!

: కొత్త పార్టీ అంటూ కొంత కాలంగా హడావుడి చేస్తున్న సీనియర్ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తాజాగా చేసిన ట్వీట్ విస్తృత చర్చకు దారితీస్తోంది. ఈ దసరా పర్వదినాల్లో తన పార్టీ పేరు, జెండా, ఎజెండా ప్రకటిస్తానని విజయసాయిరెడ్డి ఎక్స్ లో ట్వీట్ చేశారు. అదేసమయంలో తనను తాను బాల్‌థాక్రేతో పోల్చుకుని అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారని అంటున్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ మెరికల్లాంటి నాయకులను తయారు చేస్తానని, అధికారం జెన్ జీ యువతకు అప్పగిస్తానని వెల్లడించారు. అయితే తాను బాల్‌థాక్రేలా వెనకుంటానని ఆయన చెప్పుకోవడమే హాట్ టాపిక్ అవుతోంది.

తనది బాల్‌థాక్రే పాత్ర అంటూ విజయసాయిరెడ్డి మరాఠా పెద్దాయనతో పోల్చుకోవడంపైనే నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతోంది. హిందుత్వ అజెండాతో మరాఠా రాజకీయాలను శాసించిన బాల్‌థాక్రే స్థాయి విజయసాయిరెడ్డికి ఉందా? అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. “11 సీబీఐ, 9 ఈడీ కేసులు పెట్టుకుని బాల్‌థాక్రే అంటే ఎలా?” అంటూ ఒక నెటిజన్ సూటిగానే ప్రశ్నించాడు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పార్టీ ప్రకటిస్తానని సోమవారం ట్వీట్ చేసిన విజయసాయిరెడ్డి వెనువెంటనే మనసు మార్చుకుని నవరాత్రుల్లో పార్టీ పేరు ప్రకటిస్తానని చెప్పడంపైనా పెద్ద చర్చ జరుగుతోంది.

వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత విజయసాయిరెడ్డి చేస్తున్న విమర్శలు, ప్రకటనలపై పెద్ద చర్చే నడుస్తోంది. ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నట్లుగా విజయసాయిరెడ్డి ప్రకటనలు, ఆరోపణలు ఉంటున్నాయని అంటున్నారు. అదే సమయంలో బీజేపీ పెద్దలను మంచి చేసుకోవడానికి, వారి దృష్టిలో పడేందుకు మాజీ ఎంపీ తెగ ప్రయత్నిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఏకంగా మరాఠా కురువృద్ధుడు బాల్ థాక్రేతో తనను పోల్చుకునే సాహసం



చేయడంపై అంతా అవాక్కు అవుతున్నారు.

కొత్త పార్టీ పెడతానని చెబుతున్న విజయసాయిరెడ్డి హిందుత్వ అజెండాతో ముందుకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లుగా సందేహిస్తున్నారు. ఈ కారణంగానే మాజీ సీఎం జగన్ రెడ్డి మత ఆచారాలపైన, ఆయన హిందూ దేవుళ్లను ప్రార్థించే విధానంపైనా ఇటీవల విజయసాయిరెడ్డి విమర్శలు చేసినట్లుగా వ్యాఖ్యానిస్తున్నారు. దీనిద్వారా జగన్ రెడ్డిపై ఒక పెద్ద సమాజంలో అపోహలు సృష్టించాలనే వ్యూహంతోపాటు తనకు ఆధ్యాత్మిక చింతన ఎక్కువ అనే విషయంపై ప్రచారం చేసుకునే ఆలోచన ఉండొచ్చునని అంటున్నారు. ఇదే సమయంలో హిందూ నేతగా దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న బాలథాక్రేను తెరపైకి తెచ్చారని అంటున్నారు.అయితే బాల్ థాక్రే మాదిరిగా విజయసాయిరెడ్డి తెర వెనుక ఉంటూ రాజకీయం చేయడానికి ఆయన స్థాయితో ఈయన పోల్చుకోవడానికి చాలా తేడా ఉందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. విజయసాయిరెడ్డి పార్టీ పెడతానంటూ హడావుడి చేస్తున్న దగ్గర నుంచి ఒంటరిగానే కనిపిస్తున్నారని, ఆయనతో ఎవరూ కలిసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా కనిపించడం లేదని అంటున్నారు. మరోవైపు విజయసాయిరెడ్డి మాటలను నమ్మి ఆయనతో కలిసి రాజకీయం చేయడానికి జెన్ జీ యువత ముందుకు వచ్చే పరిస్థితులు ఉన్నాయా? అనే సందేహాలు కూడా వ్యక్తం చేస్తున్నారని చెబుతున్నారు. మొత్తానికి విజయసాయిరెడ్డి ట్వీట్ పై రకరకాల కామెంట్లతో నెటిజన్లు విరుచుకుపడుతున్నారు.

# వైసీపీ అభ్యర్థులకు కేంద్ర బలగాలతో సెక్యూరిటీ ఇవ్వాలి : హైకోర్టులో రెండు పిటిషన్లు




**హైదరాబాద్** : ఏపీలో స్థానిక ఎన్నికల విషయంలో విపక్షం వైసీపీ అత్యంత జాగ్రత్తలు తీసుకుంటోంది. ఎన్నికలు సజావుగా సక్రమంగా జరిపించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేసింది. ఏ క్షణంలో అయినా ఎన్నికల నగారా మ్రోగుతుందనే ప్రచారం నడుమ విపక్ష పార్టీ హైకోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. ఈ పిటిషన్ల ద్వారా ఎన్నికల ప్రక్రియ ప్రభావితం అయ్యే అవకాశాలు ఉన్నాయా? అనేది హైకోర్టు నిర్ణయంపై ఆధారపడి ఉందని అంటున్నారు. రాష్ట్రంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని కోరడమే కాకుండా, ప్రభుత్వ చేతుల నుంచి ఎన్నికల ప్రక్రియను దూరం చేయాలనే లక్ష్యంతో హైకోర్టును ఆశ్రయించినట్లుగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

రాష్ట్ర పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ అధికార ప్రతినిధి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక ఎన్నికలలో అభ్యర్థులకు భద్రత కల్పించడంతోపాటు పోలింగ్ బూతుల రక్షణకు కేంద్ర బలగాలను నియమించాలని కోరుతూ ఈ పిటిషన్ వేశారు. అదేవిధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో రాష్ట్ర పోలీసుల జోక్యం లేకుండా ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు 24 గంటల పాటు వెబ్ కాస్టింగ్, సీసీ టీవీ నిఘా ఏర్పాటు, మైక్రో అబ్జర్వర్లను నియమించాలని తన పిటిషన్ లో కోరింది.నిజానికి స్థానిక ఎన్నికలలో కేంద్ర భద్రతా బలగాలను మోహరించాలని వైసీపీ ఎప్పటి నుంచో కోరుతోంది. గత ఏడాది జరిగిన పులివెందుల ఉప ఎన్నికల్లో వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులను రాష్ట్ర పోలీసుల సహకారంతో అడ్డుకున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. అప్పట్లోనే స్థానిక ఎన్నికలు జరిగితే కేంద్ర భద్రతా బలగాల ద్వారానే జరగాలని తాము కోరుకుంటున్నట్లు ప్రకటించింది. లేనిపక్షంలో ఎన్నికలను బహిష్కరిస్తామని కూడా హెచ్చరించింది. అయితే ప్రస్తుతం ఎన్నికలకు అన్నీ ఏర్పాట్లు జరగడంతో ముందస్తుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లుగా చెబుతున్నారు.గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వైసీపీ ఎన్నికల విషయంలో అడుగులు వేస్తోందని అంటున్నారు. రాష్ట్రంలో కూటమి శ్రేణులు బలంగా ఉండటం, అధికార బలంతో వైసీపీ కార్యకర్తలను నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకునే పరిస్థితి ఉన్నట్లుగా వైసీపీ నేతలు సందేహిస్తున్నారు. దీంతో పల్నాడు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో నామినేషన్లు వేసేవారికి సైతం భద్రత కల్పించాలని కోరుతూ గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మరో పిటిషన్ వేశారని చెబుతున్నారు. కోర్టు ద్వారా తగిన రక్షణ పొంది తమ సత్తా చాటాలని వైసీపీ నేతలు భావిస్తున్నారని అంటున్నారు.అయితే వైసీపీ కోరుతున్నట్లుగా స్థానిక సంస్థల ఎన్నికలకు కేంద్ర భద్రతా బలగాలను నియమించే అవకాశం ఎంతవరకు ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. ఇప్పటివరకు స్థానిక ఎన్నికల విషయమై రాష్ట్రంలో ఎలాంటి అలజడులు నమోదు కాలేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు ఊహాగానాలు, భయాందోళనలకు కోర్టులు మద్దతు ఇస్తాయా? అనేది చూడాల్సివుందని అంటున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోను దేశంలో ఇతర చోట్ల స్థానిక ఎన్నికలకు కేంద్ర బలగాలను వాడిని ఉదంతాలు లేవని అంటున్నారు. ఇక వైసీపీ అభ్యంతరాలపై హైకోర్టు నిర్ణయం ఎలా ఉంటుందో చూడాల్సివుందని వ్యాఖ్యానిస్తున్నారు.

## కాకినాడ కార్పొరేషన్‌పై జనసేన కన్ను..

# వైసీపీకి కోలుకోలేని దెబ్బ..!

**కాకినాడ, అక్టోబరు 13** : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి పతాక స్థాయికి చేరిన వేళ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాల్లో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో కీలకమైన మేయర్ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలనే వ్యూహంతో జనసేన పార్టీ అడుగులు వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు కీలక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.కూటమి సీట్ల సర్దుబాటులో జనసేన పార్టీ దక్కించుకోబోయే మున్సిపల్ కార్పొరేషన్లు, ముఖ్యంగా కాకినాడ వంటి కీలక మేయర్ స్థానాల్లో క్షేత్రస్థాయి బలాన్ని పెంచుకోవడంపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. వైపక్ష వైఎస్సార్సీపీని రాజకీయంగా దెబ్బకొట్టడమే కాకుండా, ఆ పార్టీలోని బలమైన సామాజిక వర్గాల నేతలను, ఆర్థికంగా అండదండలు ఉన్న నాయకులను తమవైపు తిప్పుకోవడంలో జనసేన సఫలీకృతమవుతోంది. క్షేత్రస్థాయిలో పట్టున్న వైసీపీ నేతలను వరుసగా పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా ప్రతిపక్షాన్ని కోలుకోలేని దెబ్బ తీసేలా జనసేన వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది.పెద్దాపురం, కాకినాడ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్సీపీకి పట్టున్న డివిజన్లు మరియు గ్రామాల్లోని ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇప్పుడు జనసేన వైపు మొగ్గు చూపుతోంది. జనసేన పోటీ చేయాలనుకుంటున్న కార్పొరేషన్ పరిధిలోని వార్డుల్లో గెలుపు గుర్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవడానికి ఈ వలసలు బాగా ఉపయోగపడనున్నాయి. క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలాన్ని భారీగా పెంచుకోవడం ద్వారా, కూటమి సీట్ల సర్దుబాటు చర్చల్లో ఎక్కువ వార్డులు మరియు మేయర్ స్థానాలను దక్కించుకోవచ్చనేది జనసేన అంతర్గత వ్యూహంగా కనిపిస్తోంది.అటు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రీజనల్ కోఆర్డినేటర్లతో భేటీ అయి మేయర్ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో పడగా.. ఇటు పవన్ కళ్యాణ్ ఆ పార్టీలోని కీలక నేతలను జనసేనలోకి లాగుతూ క్షేత్రస్థాయిలో వైఎస్సార్సీపీకి గట్టి సవాల్ విసురుతున్నారు. రాబోయే రోజుల్లో గోదావరి జిల్లాల నుంచి మరికొంత మంది ప్రతిపక్ష నేతలు జనసేన బాట పట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

**పవన్ కళ్యాణ్ రాజకీయ శంఖారావం**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ శంఖారావం పూరించారు. పోలవరం జిల్లాలో నిర్వహించిన అడవితల్లి బాట కార్యక్రమమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల పోరుకు శ్రేణులను సమాయత్తం చేస్తూ, క్షేత్రస్థాయిలో కూటమి విజయానికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలని కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. జనసేనకు అనుకూలంగా

నినాదాలు చేస్తున్న వారిని వారించి కూటమి గురించి ప్రత్యేకంగాప్రస్తావించారు.సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు, ప్రజా సంక్షేమం కోసం జనసైనికులు ఎంతో త్యాగం చేశారని కొనియాడారు. ఎలాంటి పదవులూ ఆశించకుండా కేవలం కూటమి విజయమే ధ్యేయంగా పనిచేసిన తీరు అభినందనీయమని ప్రశంసించారు. రాబోయే స్థానిక పోరులో కూడా అదే ఐక్యతను చాటాలని, కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి వార్డు స్థాయి వరకు కూటమి

భాగస్వామ్య పక్షాలు కలిసికట్టుగా పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.ఎన్నికలు ముగిసిన తర్వాత ఇకపై కేవలం అభివృద్ధిపైనే పూర్తి దృష్టి సారించామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. సినిమాల్లో రెండు గంటల్లో మార్పు వచ్చినట్లు నిజ జీవితంలో జరగదు. ప్రజాక్షేత్రంలో నిరంతరం కష్టపడి పనిచేయడమే ముఖ్యం అని జనసైనికులకు స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల పురోగతి కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని, ఏడు జిల్లాల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. సీఎం చంద్రబాబు నాయుడి అపార అనుభవంతో రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తోందని, స్థానిక పోరులో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు.ఇదే సమయంలో పార్టీ అంతర్గత క్రమశిక్షణ, ప్రజాప్రతినిధుల ప్రవర్తనపై కూడా పవన్ పరోక్షంగా కఠిన సంకేతాలు ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు ప్రజలకు పారదర్శకంగా, అవినీతిరహితంగా సేవలందించాలని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతామని వెల్లడించా

ఆర్యాద్వి

## సంపాదకీయం Editorial



# ఎల్ నినో ఎఫెక్ట్: పొలాలకు వెళ్లి కోతకు ముందే కొనేస్తున్నారు



**విపత్తుల గురించి హెచ్చరికలు జారీ చేసినప్పుడు దాని ప్రభావం ఎంతలా ఉంటుందన్న విషయాన్ని చాలా మంది పట్టించుకోరు. కాలం గడుస్తున్న కొద్దీ.. చోటు చేసుకునే పరిణామాలు ప్రజలకు షాకుల మీద షాకులు ఇస్తాయి. ఇప్పుడు ఎల్ నినో విషయంలో అలాంటి పరిస్థితులే ఎదురవుతున్నాయి. మారిన వాతావరణ పరిస్థితులు.. మనిషి చేసిన తప్పులకు శాపంగా ఎల్ నినో ఎదురవుతుంటుంది అప్పుడప్పుడు. ఇప్పుడు సూపర్ ఎల్ నినో వచ్చి పడింది. చూస్తుండగానే దాని విశ్వరూపంలోని మొదటి అంకం ప్రజల అనుభవంలోకి వచ్చేసింది. వర్షాలు పడాల్సిన సమయంలో పడకపోవటం.. అక్టోబరులోకి వచ్చినా ఉష్ణోగ్రతల్లో మార్పు లేకపోగా.. చలి అన్నదే అడ్రస్ లేకుండా పోవటం మరో ఎత్తు. ఇదే సమయంలో వానలు లేని కారణంగా పంటలు ఎండిపోతున్నాయి.**

మరోవైపు.. సాగునీటికి మాత్రమే కాదు తాగు నీటికి సైతం ముప్పు పొంచి ఉందన్న వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వాలు సైతం ఎల్ నినో ఎఫెక్టు రానున్న నెలల్లో మరింత ఎక్కువగా ఉండటమే కాదు.. ప్రజల మీద దీని ప్రభావం అమితంగా ఉంటుందన్న విషయాన్ని గుర్తించి.. ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత లేకుండా చేయటం కోసం కసరత్తులు మొదలెట్టాయి. పంటలు వేయొద్దని కోరుతున్నాయి. క్రాప్ హాలీడేను ప్రకటిస్తున్నాయి. చూస్తుండగానే బియ్యం ధరలకు రెక్కలు రావటమే కాదు కేజీ రూ.70 దాటేసిన పరిస్థితి. ఇదంతా ఒక ఎత్తు అయితే.. ఇప్పటివరకు ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనమన్నా కొనేవారుకాదు. కానీ.. ఇప్పుడు మద్దతు ధరకు రెట్టింపు పెట్టి కొనటం ఈ మధ్యన మొదలైంది. కట్ చేస్తే.. తాజాగా మరో షాకింగ్ పరిణామం మొదలైంది. అదేమంటే.. పంట కోసే వరకు ఆగకుండా కంకి దశలోనే కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావటం చూస్తే.. రానున్న రోజుల్లో బియ్యం డిమాండ్ ఎంతలా ఉంటుందన్న విషయాన్ని అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణలోని పలు ప్రాంతాలకు మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు వడ్లు కొనేందుకు తెలంగాణ పల్లెల్లో తిరుగుతున్న వైనం ఈ మధ్యన మొదలైంది. అంతేకాదు.. పంట నాణ్యత సంగతిని పక్కన పెట్టేసి.. కోతకు సిద్ధంగా లేని పంటకు సైతం ధరలు డిసైడ్ చేస్తూ.. అడ్వాన్సులు ఇచ్చేసి ఒప్పందాల మీద ఒప్పందాలు చేసుకుంటున్న పరిణామం చూస్తే.. రానున్న రోజుల్లో బియ్యం ధరలు.. డిమాండ్ ఏ స్థాయిలో ఉంటుందన్న విషయం అర్థమవుతుంది. ఇప్పటికే మార్కెట్ లో బియ్యం ధరలు కనిష్ఠంగా రూ.6వేలు (100 కేజీలు) నుంచి గరిష్ఠంగా రూ.8500 (వంద కేజీలు) ధరలు పలుకుతున్నాయి. ఎల్ నినో ప్రభావంతో వరి పంట చాలా తక్కువమంది మాత్రమే వేస్తున్న వేళ.. బియ్యం ధరలకు రెక్కలు రావటం ఖాయమన్న అంచనాలు ఉన్నాయి. ఈ విషయాన్ని పసిగట్టిన వ్యాపారులు రంగంలోకి దిగారు. గ్రామాల్లోకి వెళ్లి క్వింటాలు వడ్లకు రూ.4వేల నుంచి రూ.4600 వరకు ఇస్తామని చెబుతూ అడ్వాన్సులు ఇచ్చేస్తున్నారు. ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. నాణ్యత మాటేమిటి? అంటే.. ఆ సంగతి మేం చూసుకుంటామని చెప్పటం గమనార్హం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం మద్దతు ధర రూ.2441 నుంచి రూ.2461- (ఏ గ్రేడ్) ఉండగా.. ఇందుకు దగ్గర దగ్గర 90 శాతం వరకు ఎక్కువగా డీల్స్ కుదుర్చుకోవటం విశేషం.అంతేకాదు.. తరుగుతో సంబంధం లేదని.. పండిన వడ్లను కోతలు కోసినంతనే తాము తీసుకెళ్లిపోతామని అభయమిస్తుండటం గమనార్హం. తేమ విషయాన్ని వదిలేయాలని చెబుతూ అగ్రిమెంట్లు కుదుర్చుకుంటున్న వ్యాపారుల తీరు చూస్తే.. రానున్న రోజుల్లో బియ్యం ధరలు ఎంతలా మారతాయన్న దానికి తాజా పరిణామాలు శాంపిల్ గా చెబుతున్నారు. సో.. బీకేర్ ఫుల్ బాస్.

---



# రోజూ ఈ 5 పనులు చేయండి.. జీవితం మరింత ఆనందంగా మారుతుంది!

ఉదయం లేవగానే ఫోన్ చూడొద్దు
సాయంత్రం దీపం వెలిగించండి
భోజనానికి ముందు కృతజ్ఞత చెప్పండి
ఫోన్ లేకుండా కాసేపు నడవండి
నిద్రకు ముందు మంచి విషయాన్ని గుర్తు చేసుకోండి

**జీవితంలో ఏదైనా గొప్ప విజయం సాధించినప్పుడే ఆనందం కలుగుతుందని అనుకుంటాం. ఏదైనా ప్రత్యేకమైన రోజు వస్తేనే మనసుకు ఉత్సాహం వస్తుందని భావిస్తాం. కానీ రోజూ మనం చేసే చిన్నచిన్న పనుల్లోనూ ఆనందాన్ని వెతుక్కోవచ్చు. ఉదయం నిద్రలేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు కొన్ని అలవాట్లను పాటిస్తే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. రోజంతా జరిగిన విషయాలను హాయిగా ఆస్వాదించగలుగుతాం. మరి, రోజువారీ జీవితాన్ని మరింత అర్థవంతంగా మార్చే ఆ ఐదు చిన్న అలవాట్లు ఏంటో తెలుసుకుందాం..**

1. ఉదయం లేవగానే ఫోన్ చూడకండి

నిద్రలేవగానే ఫోన్ తీసుకుని మెసేజ్‌లు, వార్తలు, సోషల్ మీడియా చూడటం చాలామందికి అలవాటు. అలా కాకుండా ఉదయం కొన్ని నిమిషాలు మీకోసం కేటాయించండి. కిటికీ తెరిచి బయట వాతావరణాన్ని చూడండి. ప్రశాంతంగా కూర్చోండి. ఇష్టమైతే చిన్న ప్రార్థన చేసుకోండి లేదా నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ ఉండండి. రోజు ప్రారంభంలోనే ఇతరుల సందేశాలు, పనుల గురించి ఆలోచించకుండా కాసేపు మీ మనసుకు విశ్రాంతి ఇవ్వండి. ఈ చిన్న మార్పు రోజంతా ప్రశాంతంగా ఉండేందుకు తోడ్పడుతుంది.

**2. సాయంత్రం దీపం వెలిగించండి**

రోజంతా పని, ఇంటి బాధ్యతలతో అలసిపోతుంటాం. ఆ సమయంలో సాయంత్రం ఒక దీపం వెలిగించడం మంచి అలవాటుగా మారుతుంది. చాలామందికి ఇది ఆధ్యాత్మిక ఆచారం. మరికొందరికి రోజంతా ఎదురైన ఒత్తిడి నుంచి కాసేపు బయటపడే అవకాశంగా ఉపయోగపడుతుంది. దీపం వెలిగించినప్పుడు ఆ రోజు ఎదురైన ఇబ్బందులు, పని ఒత్తిడిని కాసేపు పక్కన పెట్టండి. జరిగిన విషయాలన్నింటినీ మనసులో పెట్టుకుని రాత్రి వరకు బాధపడకుండా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించండి.

**3. భోజనం చేసే ముందు కృతజ్ఞత చెప్పండి**

ఆకలిగా ఉన్నప్పుడు భోజనం ముందు కూర్చోగానే తినడం మొదలుపెడతాం. కానీ మొదటి ముద్ద తినే ముందు కొన్ని క్షణాలు ఆగండి. ఆ భోజనం తయారు చేసిన వ్యక్తిని గుర్తు చేసుకోండి. మనకు ఆహారం అందేందుకు కష్టపడిన రైతులు, ఇతరుల శ్రమను తలచుకోండి. లేదంటే మనకు తినడానికి ఆహారం ఉన్నందుకు మనసులోనే కృతజ్ఞత చెప్పుకోండి.

ఇది చిన్న విషయంలా అనిపించినా, మనం చేసే పనుల విలువను గుర్తించేందుకు సహాయపడుతుంది. రోజూ యాంత్రికంగా చేసే పనుల్లోనూ ఆనందాన్ని గుర్తించగలుగుతాం.

**4. ఒక్కసారైనా ఫోన్ లేకుండా నడవండి**

నడక అంటే వ్యాయామం చేయడం లేదా ఫోన్‌లో పాటలు, వీడియోలు వినడం మాత్రమే కాదు. అప్పుడప్పుడు ఫోన్‌ను పక్కన పెట్టి బయట నడవండి. ఆకాశం, చెట్లు, చుట్టూ ఉన్న మనుషులు, వారి మాటలు, రోడ్డుపై వినిపించే శబ్దాలను గమనించండి.

రోజూ చూసే పరిసరాలనే కొత్తగా గమనించే అవకాశం లభిస్తుంది. మనసును ప్రశాంతంగా ఉంచేందుకు ప్రతిసారీ ధ్యానం చేయాల్సిన అవసరం లేదు. మనం ఉన్న చోటును, చుట్టూ జరిగే విషయాలను శ్రద్ధగా గమనించడం కూడా మంచి అనుభూతిని ఇస్తుంది.

5. నిద్రపోయే ముందు ఓ మంచి విషయాన్ని గుర్తు చేసుకోండి

రోజంతా ఎన్ని పనులు చేసినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. పడుకునే ముందు ఆ రోజు జరిగిన ఒక మంచి విషయాన్ని గుర్తు చేసుకోండి. ఎవరైనా ప్రేమగా మాట్లాడి ఉండొచ్చు. రుచికరమైన భోజనం చేసి ఉండొచ్చు. చాలా రోజులుగా వాయిదా వేస్తున్న పనిని పూర్తి చేసి ఉండొచ్చు. లేదంటే కాసేపు ప్రశాంతంగా గడిపి ఉండొచ్చు.రోజంతా గొప్పగా గడవకపోయినా, గుర్తుంచుకోదగిన మంచి విషయం ఒక్కటైనా ఉంటుంది. దాన్ని గుర్తు చేసుకుంటూ నిద్రపోవడం వల్ల రోజును సానుకూలంగా చూసే అలవాటు పెరుగుతుంది.

**చిన్న అలవాట్లలోనే అసలైన ఆనందం!**

ఈ ఐదు పనుల కోసం ఎక్కువ సమయం కేటాయించాల్సిన అవసరం లేదు. పెద్ద మార్పులు చేసుకోవాల్సిన పనీ లేదు. ఉదయం ఫోన్‌కు దూరంగా ఉండటం, సాయంత్రం దీపం వెలిగించడం, భోజనానికి కృతజ్ఞత చెప్పడం, ఫోన్ లేకుండా నడవడం, రాత్రి ఓ మంచి విషయాన్ని గుర్తు చేసుకోవడం.. ఇవన్నీ సులభంగా అలవాటు చేసుకోవచ్చు.ఈ చిన్న పనులు ఒక్కరోజులోనే జీవితాన్ని మార్చేయకపోవచ్చు. కానీ మన చుట్టూ ఇప్పటికే ఉన్న మంచి విషయాలను గుర్తించడం నేర్పుతాయి. ప్రతి రోజును మరింత ప్రశాంతంగా, ఆనందంగా గడిపేందుకు దోహదపడతాయి.

రచయితలకు ఆహ్వానం!
మీ ఆలోచనలకు అక్షరరూపం ఇవ్వండి..
మీ రచనలు, కథలు, కవితలు, వ్యాసాలు, సామాజిక అంశాలపై మీ అభిప్రాయాలను ఆర్యాద్వి పత్రిక ద్వారా పాఠకులకు చేరవేయండి.
మీ రచనలకు మా వేదికపై ప్రత్యేక స్థానం కల్పిస్తాం.
ఆసక్తి ఉన్న రచయితలు తమ రచనలను మాకు పంపించండి


పంపాల్సిన చిరునామా:
వాట్సాప్ నంబర్:
9912456573

# రంజీ ట్రోఫీలో అభిషేక్ పోరెల్ శతకం



బెంగాల్ వికెట్‌కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ రంజీ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన చేశాడు. ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో శతకంతో మెరిసిన అతడు.. సెంచరీ పూర్తి చేసిన వెంటనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఇటీవల వ్యక్తిగత, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొన్న అనంతరం మైదానంలోకి తిరిగి వచ్చిన పోరెల్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతడి భావోద్వేగ క్షణాలు మైదానంలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ సీజన్‌లో బెంగాల్ తరఫున తొలి మ్యాచ్ ఆడుతున్న 23 ఏళ్ల పోరెల్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 137 బంతుల్లో 114 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో బ్యాటర్ సుదీప్ ఘరామి సైతం 122 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. వీరిద్దరూ శతకాలతో రాణించడంతో బెంగాల్ జట్టు భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ జట్టు 240 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. దీంతో ప్రత్యర్థిపై 64 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. కీలక సమయంలో పోరెల్, ఘరామి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తన రెండో శతకాన్ని పూర్తి చేసిన వెంటనే పోరెల్ మోకాళ్లపై కూర్చొని కన్నీళ్లు పెట్టుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తేరుకుని బ్యాట్‌ను పైకెత్తి అభివాదం చేశాడు. ఈ దృశ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మ్యాచ్ అనంతరం పోరెల్ మాట్లాడుతూ.. తాను తెలియకుండానే భావోద్వేగానికి గురయ్యానని తెలిపినట్లు కథనాలు పేర్కొన్నాయి. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలనుకుంటున్నట్లు వెల్లడించాడు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన కోచ్ లక్ష్మీ రతన్ శుక్లా, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపాడు. కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని పెళ్లి పేరుతో మోసం చేశాడని, అత్యాచారం, బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ పోరెల్‌పై ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఫిర్యాదు నేపథ్యంలో ఆగస్టు 11న పోలీసులు అతడిని అరెస్టు చేసినట్లు కథనాలు వెల్లడించాయి. నెల రోజులకు పైగా జైలులో ఉన్న అనంతరం సెప్టెంబరులో చిన్సురా కోర్టు నుంచి బెయిల్ పొందినట్లు సమాచారం. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను పోరెల్ ఖండించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలు న్యాయపరమైన విచారణకు సంబంధించినవి కావడంతో, వాటిని నిర్ధారిత నేరాలుగా పరిగణించరాదు. బెయిల్‌పై విడుదలైన తర్వాత పోరెల్‌కు బెంగాల్ రంజీ జట్టులో చోటు దక్కింది. అతడి వ్యక్తిగత, న్యాయపరమైన వ్యవహారాలు తమ పరిధిలోకి రావని, జట్టు ఎంపికలో అతడిని పరిగణనలోకి తీసుకున్నామని బెంగాల్ క్రికెట్ సంఘం తెలిపినట్లు సమాచారం. ఢిల్లీతో మ్యాచ్‌లో శతకం సాధించడం ద్వారా పోరెల్ తన క్రికెట్‌పై దృష్టి సారించాడు. అతడి ప్రదర్శన బెంగాల్ జట్టుకు కీలకంగా మారింది.

# ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్‌కు చోటు దక్కేనా?




: 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తుపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు మిథున్ మన్హాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. జట్టు ఎంపికలో వయసు కంటే ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అయితే, తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని పేర్కొన్నారు. 2027 వన్డే ప్రపంచకప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనుంది. ఈ మెగా టోర్నీలో భారత్ తరఫున ఎవరు బరిలోకి దిగుతారన్న అంశంపై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వయసు పెరుగుతున్న కోహ్లీ, రోహిత్ జట్టులో కొనసాగుతారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై స్పందించిన మిథున్ మన్హాస్.. ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా నిర్ణయం తీసుకోదని, సెలెక్టర్లు, కోచ్‌లు ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారని వివరించినట్లు సమాచారం. ఆటగాడి వయసును మాత్రమే ప్రమాణంగా తీసుకోకుండా, అతడి ఫిట్‌నెస్, ఆటతీరు, జట్టుకు అందించే సహకారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించే సామర్థ్యం ఉన్నవారికి వయసు అడ్డంకి కాకూడదన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడిని ఎదుర్కొన్న సీనియర్ ఆటగాళ్ల అనుభవం జట్టుకు బలాన్నిస్తుందని భావిస్తున్నారు. అదే సమయంలో జస్‌ప్రీత్ బుమ్రా వంటి బౌలర్లు బౌలింగ్ విభాగంలో కీలక బాధ్యతలు చేపట్టగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఆటగాళ్లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తే ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీల్లో విజయావకాశాలు మెరుగుపడతాయని విశ్లేషించారు. మాజీ భారత క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కూడా 2027 ప్రపంచకప్ సన్నద్ధతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికా పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పరిస్థితుల్లో బౌలర్ల నాణ్యత కీలకంగా మారుతుందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంతో పాటు కీలక సమయాల్లో వికెట్లు తీయగల బౌలింగ్ విభాగం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్‌ను గెలవాలంటే భారత్ బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని కైఫ్ సూచించారు. పరుగులను అడ్డుకోవడం, కీలక క్యాచ్‌లను అందుకోవడం, ఒత్తిడిలో తప్పిదాలను తగ్గించుకోవడం విజయానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మొత్తంగా 2027 ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఆడే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. వారి ప్రస్తుత ఫిట్‌నెస్, ప్రదర్శన, జట్టు అవసరాలను బట్టి ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తుది జట్టు కూర్పుపై అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగనుంది.

# టీమిండియాలోకి ఔకిబ్ నబీ.. కారు కొనుగోలుపై చర్చ!

జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ క్రికెటర్ ఔకిబ్ నబి భారత జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో భాగంగా గువాహటిలోని బర్సాపరా క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో టీమిండియా తరఫున తొలి మ్యాచ్ ఆడాడు. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చేతుల మీదుగా జాతీయ జట్టు టోపీని అందుకున్నాడు. దీంతో జమ్మూకశ్మీర్ నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మూడో క్రికెటర్‌గా నిలిచాడు. గతంలో పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ ఈ ఘనత సాధించారు.

### షోరూమ్‌లో కారు.. సామాజిక మాధ్యమాల్లో చర్చ

అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఔకిబ్ నబీకి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియోలో అతడు ఓ కార్ల ప్రదర్శనశాలలో హ్యుందాయ్ కారులో కూర్చొని కనిపించాడు. దీంతో నబీ కొత్త కారు కొనుగోలు చేశాడంటూ పలువురు అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. అయితే, అతడు నిజంగానే కారును కొనుగోలు చేశాడా? అనే విషయంపై స్పష్టమైన సమాచారం లేదు.

### అరంగేట్ర మ్యాచ్‌లో నిరాశాజనక ప్రదర్శన

భారత జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ, తొలి వన్డేలో నబీకి కఠిన పరీక్ష ఎదురైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై బౌలింగ్ చేసిన అతడు 8.4 ఓవర్లలో 84 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ కావడంతో అతడిపై అంచనాలు నెలకొన్నప్పటికీ, బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. భారత వన్డే జట్టుకు ఎంపిక కావడంతో నబీ ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌కు జమ్మూకశ్మీర్ తరఫున అందుబాటులో లేకపోయాడు. ఆ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ జట్టు రెస్ట్ ఆఫ్ ఇండియా చేతిలో 167 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

### రంజీ ట్రోఫీలో 60 వికెట్లు

2025-26 రంజీ ట్రోఫీ సీజన్‌లో ఔకిబ్ నబీ అద్భుతంగా రాణించాడు. ఏకంగా 60 వికెట్లు పడగొట్టి జమ్మూకశ్మీర్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అతడికి భారత టెస్టు జట్టులోనూ అవకాశం దక్కవచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులోనూ నబీకి చోటు లభించింది. భారత్ ఆ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్నప్పటికీ, తుది జట్టులో ఆడే అవకాశం అతడికి రాలేదు. అనంతరం ఇంగ్లాండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సర్రే జట్టు తరఫున ఆడాడు.

### సెలెక్టర్ల దృష్టిలో నబీ ప్రదర్శన

అంతర్జాతీయ స్థాయిలో తొలి మ్యాచ్ ఆడిన నబీ, రాబోయే పోటీల్లో తన బౌలింగ్‌తో ఆకట్టుకోవాల్సి ఉంది. అతడి ప్రదర్శనను భారత సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. భారత్-ఎ జట్టు న్యూజిలాండ్ పర్యటనతో పాటు రానున్న టెస్టు సిరీస్‌ల కోసం జట్ల ఎంపిక నేపథ్యంలో దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి ప్రదర్శన కీలకం కానుంది. రంజీ ట్రోఫీలో వికెట్ల వేటతో గుర్తింపు పొందిన నబీ, భారత జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంటాడా అనేది ఆసక్తికరంగా మారింది.







# ఐసీసీ అవార్డుల్లో గిల్, షఫాలీ వర్మకు గుర్తింపు

భారత క్రికెటర్లు శుభ్‌మన్ గిల్, షఫాలీ వర్మ తమ అద్భుత ప్రదర్శనలతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఐసీసీ నెలవారీ ఉత్తమ ఆటగాళ్ల పురస్కారాలను వీరిద్దరూ అందుకున్నారు. పురుషుల విభాగంలో గిల్ ఈ పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకోగా, మహిళల విభాగంలో షఫాలీ వర్మ తన ఆటతీరుతో మరోసారి అవార్డును దక్కించుకున్నారు. భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ నెలవారీ ఉత్తమ పురుష ఆటగాడి పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకున్నాడు. గతంలో 2023 జనవరి, సెప్టెంబరు నెలల్లో, 2025 ఫిబ్రవరి, జూలై నెలల్లో ఈ అవార్డును అందుకున్నాడు. తాజాగా మరోసారి పురస్కారం దక్కించుకోవడంతో ఈ ఘనత సాధించిన ఆటగాళ్లలో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గిల్ బ్యాట్‌తో మెరిశాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు సాధించగా, రెండో వన్డేలో 223 పరుగులతో సత్తా చాటినట్లు సమాచారం. తన అభిమానుల ముందు పరుగులు సాధించడం ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చిందని గిల్ పేర్కొన్నాడు. ఐదోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని, తనను ఎంపిక చేసిన ఐసీసీ ప్యానెల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు. భారత మహిళా క్రికెటర్ షఫాలీ వర్మ కూడా ఐసీసీ నెలవారీ ఉత్తమ మహిళా ఆటగాడి అవార్డును గెలుచుకుంది. గత ఏడాది నవంబరులోనూ ఆమె ఈ పురస్కారాన్ని అందుకుంది. ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై కీలక ఇన్నింగ్స్ ఆడి భారత జట్టు విజయానికి తోడ్పడిన షఫాలీ, ఇటీవల జరిగిన పోటీల్లోనూ తన దూకుడైన ఆటను కొనసాగించింది. ఆసియా కప్‌లో షఫాలీ వర్మ 360 పరుగులు సాధించడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టింది. ఆసియా క్రీడల్లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శతకం సాధించగా, శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 48 పరుగులు చేసింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. మరోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని షఫాలీ పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ గుర్తింపు పొందడం తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపింది. గిల్, షఫాలీకి అవార్డులు దక్కడంతో భారత క్రికెట్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



# వెస్టిండీస్ ఆటగాళ్లకు ఐసీసీ మందలింపు

భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు విజయం సాధించినప్పటికీ, ఆ జట్టు ఆటగాళ్లు రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్‌లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి మందలింపు ఎదురైంది. మైదానంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఇద్దరికీ ఒక్కొక్క డీమెరిట్ పాయింట్ విధించినట్లు సమాచారం. అక్టోబరు 9న రాంచీలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ సందర్భంగా వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ బ్యాట్‌తో బంతిని బాదిన ఘటనను ఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే బ్యాటర్ షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేసిన వ్యవహారంపైనా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పావెల్, రూథర్‌ఫర్డ్‌లను ఐసీసీ మందలించడంతో పాటు ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ కేటాయించినట్లు వార్తలు వెల్లడించాయి. అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆటగాళ్లు ఐసీసీ ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. మైదానంలో అనుచిత ప్రవర్తన, అంపైర్ల నిర్ణయాలపై అసహనం వ్యక్తం చేయడం వంటి ఘటనలపై నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. భారత్‌పై రెండో టీ20లో విజయం సాధించిన వెస్టిండీస్‌కు ఈ పరిణామం ఎదురైంది. అయితే ఈ చర్యలపై పూర్తి వివరాలు, అధికారిక ప్రకటనకు సంబంధించిన సమాచారం స్పష్టంగా అందుబాటులోకి రావాల్సి ఉంది.





# ‘కల్కి-2’ బోర్డులోకి నవంబర్‌లో సాయిపల్లవి?

ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో రానున్న ‘కల్కి 2898 ఏడీ’ సీక్వెల్ ‘కల్కి-2’ చుట్టూ అభిమానుల ఎదురుచూపులు పెరుగుతున్నాయి. 2024లో వచ్చిన తొలిభాగం పాన్ ఇండియా స్థాయిలో హిట్టయ్యింది. జాతీయ చలనచిత్ర పురస్కారం కూడా గెలుచుకుంది. అయితే ప్రభాస్ ఇతర చిత్రాల కమిట్‌మెంట్ల కారణంగా సీక్వెల్ షూటింగ్ నెమ్మదిగా సాగుతోంది. ఈ చిత్రంనుంచి దీపిక పదుకొణె తప్పుకున్నారు. ఆమె స్థానంలో సాయిపల్లవిని తీసుకున్నారన్న వార్తలు వినిపించాయి. అయితే చిత్ర బృందం ఈ ఎంపికను ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. దీపిక చేసిన సుమతి పాత్రనే ఆమె చేస్తారా? లేక కొత్త పాత్రా? అన్నది కూడా స్పష్టత రాలేదు. ముందుగా ఈ అక్టోబర్‌లోనే సాయిపల్లవి సెట్స్‌లో చేరతారని భావించారు. కానీ ఇప్పుడు ప్లాన్ మారినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె ‘రామాయణ’ (నవంబర్ 5 విడుదల)పై దృష్టి పెట్టారు. ఆ చిత్రం విడుదలయ్యాక, నవంబర్‌లో ‘కల్కి-2’ సెట్స్‌లోకి అడుగుపెడతారని సినీ వర్గాలు చెబుతున్నాయి. నాగ్ అశ్విన్ ఇటీవల మధ్య అక్టోబర్‌నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని చెప్పగా, ఈనెల 17 నుంచి హైదరాబాద్‌లో కీలక షెడ్యూల్ ప్లాన్ చేశారని, నవంబర్‌లో ముంబైలో అమితాబ్ బచ్చన్ సన్నివేశాలు చిత్రీకరిస్తారని నివేదికలు చెబుతున్నాయి. ప్రభాస్ డిసెంబర్ లేదా వచ్చే ఏడాది ఆరంభంలో డేట్స్ ఇస్తారని అంచనా. విడుదల 2028లో ఉండొచ్చని ప్రచారం ఉంది. ఈ వివరాలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

పాప్ స్టార్!




## చరణ్-సుకుమార్ ‘ఆర్సీ17’: కొత్త లుక్, కొత్త హీరోయిన్?

‘పెద్ది’ తర్వాత విరామం తీసుకున్న రామ్‌చరణ్, సుకుమార్ దర్శకత్వంలో రానున్న ‘ఆర్సీ17’ కోసం సిద్ధమవుతున్నారు. ఇటీవల చేతి మణికట్టుకు శస్త్రచికిత్స చేయించుకుని కోలుకున్న ఆయన, ఈ చిత్రంలో కొత్త లుక్ కోసం బరువు తగ్గే పనిలో ఉన్నారు, ప్రత్యేక డైట్, వ్యాయామాలు పాటిస్తున్నారని సమాచారం. సుకుమార్ ఫైనల్ స్క్రిప్ట్ సిద్ధం చేయగా, ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. దసరా సందర్భంగా ఈనెల 20న హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో చిత్రాన్ని ప్రారంభించి, డిసెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టేందుకు బృందం సన్నాహాలు చేస్తోంది. ప్రారంభ తేదీపై కొన్ని నివేదికల్లో భిన్న సమాచారం ఉంది. హీరోయిన్‌గా ‘ధురంధర్’ ఫేమ్ సారా అర్జున్ ఖరారయ్యారన్న వార్తలు వినిపిస్తున్నాయి. సుకుమార్ చెప్పిన కథనచ్చి ఆమె వెంటనే ఓకే చెప్పారని సమాచారం. అయితే ఆమె పేరు గతంలోనూ వినిపించింది, మేకర్స్ నుంచి అధికారిక స్పష్టత లేదు; మరో నటి రుక్మిణి వసంత్ పేరూ ప్రచారంలో ఉంది. సంగీత దర్శకుడిపై కూడా చర్చ కొనసాగుతోంది. అనిరుధ్ లేదా శాశ్వత్ సచ్‌దేవ్ పేర్లు వినిపిస్తుండగా, ఇంతకుముందు దేవిశ్రీ ప్రసాద్ పేరు కూడా ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కలిసి భారీ బడ్జెట్‌తో నిర్మించే ఈ చిత్రంపై ఇంకా అధికారిక ప్రకటనలు రావాల్సి ఉంది.





## శ్రీవారి సన్నిధిలో ‘రణబాలి’ జంట..

సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులు మంగళవారం వేకువజామున తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సుప్రభాత సేవలో పాల్గొన్న వీరు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లి మూలవిరాట్‌ను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. విజయ్ తెల్లని పట్టు కుర్తా, ధోవతిలో, రష్మిక పసుపు రంగు పట్టు చీరలో సంప్రదాయ వస్త్రధారణలో కనిపించారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వీరికి ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం నుంచి బయటకు వచ్చాక అభిమానులు ఫొటోలు, ఆటోగ్రాఫ్‌ల కోసం చుట్టుముట్టగా, భద్రతా సిబ్బంది వారిని గోల్ఫ్ కార్ట్ వద్దకు తీసుకెళ్లారు. పెళ్లయ్యాక విజయ్-రష్మిక జంటగా నటించిన తొలి చిత్రం ‘రణబాలి’ విజయదశమి కానుకగా ఈ 16న విడుదల కానుంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన చారిత్రక యాక్షన్ డ్రామాలో విజయ్ యోధుడు సింగనమల బొబ్బిలి రణబాలిగా, రష్మిక జయమ్మగా కనిపిస్తారు. చిత్ర ప్రచారంలో భాగంగా సోమవారం చెన్నైలో సందడి చేసిన ఈ జంట, తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌ను కూడా కలిశారు. విడుదలకు ముందు స్వామివారి ఆశీస్సులు తీసుకునేందుకే తిరుమల వచ్చారని సమాచారం.

## ఆయ్’ దర్శకుడితో వరుణ్ తేజ్?



గీతా ఆర్ట్స్ (జీఏ2 పిక్చర్స్) బ్యానర్‌లో చిన్న సినిమాగా వచ్చి ఘన విజయం సాధించిన ‘ఆయ్’తో దర్శకుడు అంజి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన తన తదుపరి సినిమా కథ సిద్ధం చేసి, మెగా హీరో వరుణ్ తేజ్‌కు వినిపించారని, కథ నచ్చి వరుణ్ పచ్చజెండా ఊపారని ఫిలింనగర్ వర్గాల్లో వినిపిస్తోంది. ఇది ఒక విలేజ్ బ్యాక్‌డ్రాప్ కథ. ‘ఆయ్’లాగే గ్రామీణ వాతావరణంలో పూర్తి వినోదం పంచుతూ నవ్వులు పూయించేలా ఉంటుందని టాక్. ఇదే కథను ముందు నితిన్‌కు చెప్పగా ఆయన ఓకే చేశారని అప్పట్లో ప్రచారం జరిగిందని, కానీ ఆ కాంబినేషన్ సెట్ కాలేదని అంటున్నారు. అయితే కొన్ని నివేదికలు మాత్రం నితిన్ తన సొంత బ్యానర్‌లో అంజి దర్శకత్వంలో సినిమా చేసే విషయమై చర్చల్లో ఉన్నారని చెబుతున్నాయి, కాబట్టి దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్‌ను నిహారిక కొణిదెల తన ప్రొడక్షన్ హౌస్‌లో నిర్మించనున్నారన్న వార్తలూ చక్కర్లు కొడుతున్నాయి. నిహారిక ఇప్పటికే వరుణ్‌తో ‘భారీ’ అనే స్పోర్ట్స్ డ్రామా నిర్మిస్తున్నారు. ‘కొరియన్ కనకరాజు’తో తిరిగి వచ్చిన వరుణ్, ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. త్వరలోనే ఈ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



# నన్ను కొట్టొద్దు.. కాల్చొద్దు!’

## ‘జైలర్ 2’కు మిథున్ కండిషన్

రజనీకాంత్ ‘జైలర్ 2’తో అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ చిత్రంలో నటించడానికి బాలీవుడ్ సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి ఒక సరదా షరతు పెట్టారట: తన పాత్రను హీరో కొట్టకూడదు, కాల్చకూడదు! ఇటీవలి ‘జైలర్ 2 సూపర్ షో’లో రజనీకాంతే ఈ విషయం చెప్పారు. చిత్ర బృందం మిథున్‌ను సంప్రదించినప్పుడు, తన పాత్ర గురించి వివరాలు అడిగి, “విలన్ అయితే దెబ్బలు తినాలా? నన్ను కొట్టే సన్నివేశాలుంటే చేయను” అన్నారట. తర్వాత వేవ్స్ సమ్మిట్‌లో ఇద్దరి మధ్య ఈ సినిమా చర్చకు వచ్చినప్పుడు, రజనీ అడిగితే నటిస్తానని చెబుతూనే అదే షరతు పునరుద్ఘాటించారు. ఆ షరతును దర్శకుడు నెల్సన్‌తో మాట్లాడి చెబుతానని రజనీ బదులిచ్చారు, అది మిథున్ సరదాగా అన్నదేనని తనకు అనిపించిందని కూడా చెప్పారు. నెల్సన్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రంలో మోహన్‌లాల్, రమ్యకృష్ణ, విద్యాబాలన్, ఎస్.జె. సూర్య తదితరులు నటించారు. హిందీ వెర్షన్ విడుదల ఆలస్యమవుతుందన్న వార్తలను మేకర్స్ ఖండించారు; అక్కడా షెడ్యూల్ ప్రకారం 15నే విడుదలవుతుందని స్పష్టం చేసి, అధికారిక సమాచారాన్నే షేర్ చేయాలని కోరారు. అడ్వాన్స్ బుకింగ్స్‌లోనూ జోరు కనిపిస్తోంది; బుక్‌మైషోలోనే 6 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి.

## ఆది.. ‘దైవ రహస్యం’..

డైలాగ్ కింగ్ సాయికుమార్ తనయుడు ఆది సాయికుమార్, కెరీర్ ఆరంభంలో లవ్ స్టోరీలతో విజయాలు అందుకుని, తర్వాత కొన్నాళ్లు సరైన హిట్లు లేక రూట్ మార్చారు. ‘శంబాల’ అనే మిస్టిక్ థ్రిల్లర్‌తో బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించి కెరీర్‌కు బూస్ట్ అందుకున్నాడు. ఇప్పుడు అదే విజయం ఇచ్చిన ఊపుతో, అదే జానర్‌లో మరో భారీ చిత్రానికి సిద్ధమయ్యారు. త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రశాంత్ జి రుద్రప్ప నిర్మిస్తున్న చిత్రానికి నవరసన్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆది కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ‘దైవ రహస్య’ థ్రిల్లర్‌ను తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేయనున్నారు.

విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్‌లో దట్టమైన అడవి మధ్య పురాతన పూజాస్థలం, వెలుగుతున్న నూనె దీపాలు, త్రిశూలాన్ని చుట్టుకుని పడగ విప్పిన నాగుపాము దృశ్యాలు అంచనాలను పెంచుతున్నాయి. ‘కాంతార’ ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. టైటిల్, నటీనటులు, సాంకేతిక వివరాలు ఇంకా గోప్యంగా ఉన్నాయి; మరిన్ని వివరాలను దసరా రోజైన అక్టోబర్ 20న ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. శక్తివంతమైన దైవ రహస్యం, ఊహించని ట్విస్టులు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని సమాచారం.

